



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 189 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా | సోమవారం 20 జూలై 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 189 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NTR DIST, | MON 20 JULY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur






## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

- మొన్న జాతీయ సినీ అవార్డులు ప్రకటించిన కేంద్రం
- విజేతలపై అభినందనల వర్షం
- తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలు గర్వకారణమన్న ముఖ్యమంత్రి
- కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి మూలస్తంభాలని వ్యాఖ్య
- తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్: 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన

- మిగతా 2లో



## గిరిపుత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

పెన్ పవర్ డెస్క్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేసి మరోసారి మాట నిలబెట్టుకున్నారు. బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో సుమారు రూ.కోటి విలువైన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఉప ముఖ్యమంత్రి గతంలో బల్లగరువు పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. తాగునీరు, అంగన్వాడీ భవనాలు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఆయన, ఆ హామీలను కార్యరూపంలోకి తీసుకొచ్చారు. మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో మూడు అంగన్వాడీ కేంద్రాలను రూ. 55 లక్షల వ్యయంతో

- మిగతా 2లో

## రామాయపట్నం పోర్టుపై జగన్ సంచలన ఆరోపణలు..

# కూటమి సర్కార్ తీరుపై ఫైర్

- రామాయపట్నం పోర్టుపై టీడీపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న జగన్
- భారీ నష్టానికి పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- రూ.4929 కోట్ల ప్రాజెక్టును రూ.1500 కోట్లకే అమ్ముతున్నారని విమర్శ
- టీడీపీ పెద్దల జేబులు నింపడానికే ఈ స్కామ్ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- ఇదేం అర్థశాస్త్రం అంటూ చంద్రబాబును సూటిగా ప్రశ్నించిన జగన్



పెన్ పవర్ డెస్క్:రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే

- మిగతా 2లో

## గడువులోనే పనులు పూర్తి.. జాప్యానికి తావులేదు



పెన్ పవర్ డెస్క్: పాలకొల్లులో కోట్లాది రూపాయల వ్యయంతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పాలకొల్లులోని తన క్యాంపు కార్యాలయంలో

- మిగతా 2లో



## చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి..

# తొలిసారిగా మాల్డోవా, నార్త్ మాసిడోనియాకు!

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు దేశాల పర్యటనకు శ్రీకారం
- తొలిసారిగా మాల్డోవా, నార్త్ మెసిడోనియాకు వెళ్లనున్న భారత రాష్ట్రపతి
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియాలో ముర్ము పర్యటన
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండాగా ఈ చారిత్రక యాత్ర


- మిగతా 2లో

# ఓడలరేవు బీచ్‌లో విషాదం

## సముద్రంలో మునిగి ముగ్గురు యువకుల మృతి

- కోనసీమ ఓడలరేవు బీచ్‌లో తీవ్ర విషాదం
- సముద్ర స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతు
- తొలుత ఇద్దరి మృతదేహాలు లభ్యం
- ఆ తర్వాత మరో యువకుడి మృతదేహం లభ్యం
- సెలవులకు ఊరికొచ్చి ప్రాణాలు కోల్పోయిన యువత

- మిగతా 2లో



## జానీమాస్టర్ వివాదం పరిష్కారం... నిషేధం ఎత్తివేసిన ఫెడరేషన్



- టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదానికి ఫిల్మ్ ఫెడరేషన్ తెర
- కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై విధించిన నిషేధం ఎత్తివేత
- సమస్య పరిష్కారానికి చొరవ చూపిన చిరంజీవి, బాలకృష్ణ
- సుమలత నాయకత్వంలోనే డ్యాన్సర్స్ యూనియన్ కొనసాగుతుందని స్పష్టత
- ఈ నెల 26న జనరల్ బాడీ మీటింగ్‌లో తుది నిర్ణయాలు

- మిగతా 2లో

## ఢిల్లీలో అఖిలపక్ష భేటీలో రగడ..

# విపక్షాల వాకౌట్

- నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు
- నిన్న అఖిలపక్ష భేటీలో గందరగోళం
- టీఎంసీ రెబల్ ఎంపీలను ఆహ్వానించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- నిరసనగా సమావేశం నుంచి కొద్దిసేపు వాకౌట్ చేసిన విపక్ష నేతలు
- రెబల్ ఎంపీలకు ఇంకా స్పీకర్ ఆమోదం లేదని విపక్షాల వాదన
- గుర్తింపు కోరిన పార్టీలను పిలిచామని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వచ్చే ఎన్నికలకు జగన్ యుద్ధరీతిని మార్చారా?

గన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అనుకున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమి లో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది.

**కూటమిలో బీజేపీ ఉండటంతో...**

కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్ కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది.

**ఇప్పటి వరకూ ఒంటరిగానే...**

ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్ కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం.

## గడువులోనే పనులు పూర్తి..

# జాప్యానికి తావులేదు

- మొదటి పేజి తరువాయి

ఆదివారం నిర్వహించిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం, ముస్లిం షాదీఖానా, గౌడ-శెట్టిబలిజ కళ్యాణ మండపం, 27వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అభివృద్ధి, టిడ్కో గృహాల మౌలిక వసతులు, వంద పడకల ప్రభుత్వాసుపత్రి సుందరీకరణ, ఎన్టీఆర్ కళాక్షేత్రం, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉద్యానవనం, మంచినీటి చెరువుగట్టు సుందరీకరణ, తూర్పు కాపుల కళ్యాణ మండపం, ఫిషర్‌మెన్ సామాజిక భవనం తదితర పనులపై శాఖలవారీగా సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ "ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలన్నారు .ప్రజల డబ్బుతో చేపడుతున్న పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని,పనులు ఆలస్యం కావడానికి ఎలాంటి కారణాలు చెప్పొద్దు. జాప్యం జరిగితే సంబంధిత అధికారులు, కాంట్రాక్టు సంస్థలపై బాధ్యత ఉంటుంది" అని స్పష్టం చేశారు.నెమ్మదిగా సాగుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, సంబంధిత నిర్మాణ సంస్థల ప్రతినిధులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. "పాలకొల్లును అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, వేగంగా పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి" అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, మున్సిపల్ ఇంజనీర్ రాజకుమార్, డిపిఓ వీరబ్రహ్మం , పబ్లిక్ హెల్త్ డి ఈ విజయ్, వివిధ శాఖల ఇంజినీర్లు, పాల్గొన్నారు.

## ఢిల్లీలో అఖిలపక్ష భేటీలో రగడ.. విపక్షాల వాకౌట్

- మొదటి పేజి తరువాయి


అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు.సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు. టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి.
ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు ..!

- నమ్మించి వంచించిన సబ్ రిజిస్ట్రార్ ..?
- ఆ అద్దె ఇంట్లోనే అధికారి ఓ మహిళతో సహ జీవనం
- ఆ మహిళ ఎవరు ... కమల్ హాసన్ 2.0 ఎపిసోడ్ -5 లో
  వృద్ధుడి నమ్మకమే పెట్టుబడిగా కలప అక్రమ తరలింపు!
- మాయమైన లక్ష విలువైన వేగేశ కలప
- సైజుల వారీగా కారులో సర్దేసిన సబ్ రిజిస్ట్రార్!
- బాధిత వృద్ధుడి నిస్సహాయత
- 79 ఏళ్ల వయసులో న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు!
- రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ సీరియస్ యాక్షన్
- విచారణకు 2024 లోనే అధికారిక ఎండార్స్‌మెంట్!
- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరిన ఫైల్
- తప్పించుకోలేని సాక్ష్యాలతో విచారణ గండం!
- సబ్ రిజిస్ట్రార్ బెదిరింపులకు వృద్ధుడు బలి..?

**చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతలో ఉన్న ప్రభుత్వ అధికారి పైనే కలప అక్రమ తరలింపు ఆరోపణలు రావడం భీమడోలులో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 79 ఏళ్ల వృద్ధుడి ఫిర్యాదు, 2024లో జిల్లా రిజిస్ట్రార్ ఇచ్చిన విచారణ ఆదేశాలు, ఇప్పుడు మళ్లీ వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది.**

**ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు /భీమడోలు, జూలై 19 :**




ప్రజల ఆస్తులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాల్సిన రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న ఒక ప్రభుత్వ అధికారి పైనే అక్రమాల ఆరోపణలు రావడం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. భీమడోలు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ తనకు అద్దెకు ఇచ్చిన ఇంటి యజమాని అయిన 79 ఏళ్ల వృద్ధుడికి చెందిన సుమారు లక్ష రూపాయల విలువైన వేగేశ కలపను అక్రమంగా తరలించారని బాధితుడు చేసిన ఫిర్యాదు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. బాధితుడి వాదన ప్రకారం, ఇంటి ప్రాంగణంలో నిల్వ ఉంచిన ఖరీదైన వేగేశ కలపను సైజుల వారీగా వేరు చేసి కారులో తరలించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలతో పాటు తన వద్ద ఉన్న ఆధారాలను రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సమర్పించినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన జిల్లా రిజిస్ట్రార్ 2024లోనే అధికారిక ఎండార్స్‌మెంట్ జారీ చేసి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అనంతరం సంబంధిత ఫైల్ భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరినట్లు తెలుస్తోంది. ఆరోపణలపై విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే సూచనలు ఇచ్చినట్లు సమాచారం.
బాధితుడు తనకు న్యాయం జరగకపోవడంతో పలుమార్లు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, వృద్ధాప్యంలో తీవ్ర మానసిక వేదనను ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తనపై ఒత్తిళ్లు, బెదిరింపులు కూడా వచ్చాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మరో కీలక అంశంగా బాధితుడు విజయ రత్నం తీవ్ర మానసిక క్షోభకు గురై అనంతరం ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని సమాచారం. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా సంబంధిత విచారణ సంస్థల నిర్ధారణ వెలువడాల్సి ఉంది.
ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు, బాధిత కుటుంబ సభ్యుల వాదనలు, అందుబాటులో ఉన్న పత్రాలు, విచారణ పురోగతిపై పెన్ పవర్ దినపత్రిక ప్రత్యేక కథనాల శ్రేణిలో తదుపరి ఎపిసోడ్‌లో మరిన్ని వివరాలు వెల్లడించనుంది. ముఖ్యంగా బాధితుడి భార్య వెల్లడించనున్న అంశాలు ఈ కేసులో కొత్త కోణాలను వెలుగులోకి తెచ్చే అవకాశముందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

**కలప చోరీ కేసులో తీవ్ర మానసిక క్షోభతో ప్రాణాలు కోల్పోయిన విజయ రత్నం.? భీమడోలు సబ్ రిజిస్ట్రార్ అక్రమాలపై తదుపరి ఎపిసోడ్ 5 లో విజయ రత్నం భార్య సంచలన వివరణ.. మరిన్ని నిజాలు పెన్ పవర్ పాఠకుల కోసం**

# ఓడలరేవు బీచ్‌లో విషాదం

## సముద్రంలో మునిగి ముగ్గురు యువకుల మృతి

కోనసీమ జిల్లాలో ఆదివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు అలల ఉద్ధృతికి గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది.వివరాల్లోకి వెళితే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన తొమ్మిది మంది కుటుంబ సభ్యులు ఆదివారం పిక్నిక్ కోసం ఓడలరేవు బీచ్‌కు వెళ్లారు. వీరిలో అరవింద్ (23), శ్రీరామ్ (17), మంచిల సాయి సముద్రంలో స్నానానికి దిగారు. అయితే, అలల తాకిడికి వారు అదుపుతప్పి సముద్రంలో కొట్టుకుపోయారు.దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారుల సహాయంతో గాలించగా, అరవింద్, శ్రీరామ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో యువకుడు సాయి మృతదేహాన్ని కూడా వెలికితీశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో చదువు, ఉద్యోగాల నిమిత్తం ఉంటూ ఇటీవలే సెలవులపై సొంత గ్రామానికి వచ్చిన యువకులు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.
ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకేసారి ముగ్గురు యువకులు మృతి చెందడంతో మాచవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సముద్ర తీరంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి.. తొలిసారిగా

# మాల్డోవా, నార్త్ మాసిడోనియాకు!

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వారం రోజుల విదేశీ పర్యటనకు ఆదివారం బయల్దేరారు. తూర్పు ఐరోపాలోని మాల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. భారత రాష్ట్రపతి మాల్డోవా, నార్త్ మాసిడోనియాలకు వెళ్లడం ఇదే తొలిసారి కావడం ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. అలాగే, మూడు దశాబ్దాల తర్వాత భారత రాష్ట్రపతి రొమేనియాలో పర్యటించనున్నారు.జులై 19 నుంచి 25 వరకు సాగే ఈ పర్యటనలో భాగంగా మూడు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా చర్చలు జరుపుతారు. పర్యటన తొలి అంకంలో మాల్డోవా అధ్యక్షురాలు మైయా సాండు ఆహ్వానం మేరకు ఆ దేశంలో పర్యటిస్తారు. అనంతరం నార్త్ మాసిడోనియాకు వెళతారు.ఈ రెండు దేశాల్లోని అధ్యక్షులు, పార్లమెంట్ స్పీకర్లతో రాష్ట్రపతి ముర్ము సమావేశమవుతారు. అక్కడి వ్యాపార ఫోరమ్‌లలో ప్రసంగించడంతో పాటు ప్రవాస భారతీయులతోనూ భేటీ అవుతారు. పర్యటన చివరి అంకంలో భాగంగా జులై 23 నుంచి 25 వరకు రొమేనియాలో పర్యటిస్తారు. ఈ పర్యటనతో ఆయా దేశాలతో భారత సంబంధాలకు కొత్త ఊపు వస్తుందని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రపతి వెంట ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటోంది.

## రామాయపట్నం పోర్టుపై జగన్ సంచలన ఆరోపణలు..

# కూటమి సర్కార్ తీరుపై ఫైర్

- మొదటి పేజి తరువాయి

పూర్తయ్యాయని ఆయన వివరించారు.
ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

**పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు**

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు.వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

- మొదటి పేజి తరువాయి

విడుదల చేశారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు చిత్ర పరిశ్రమ సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.తెలుగు సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణుల అసాధారణ ప్రతిభ మన సినిమాకు గొప్ప గర్వకారణంగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. "కళ, సంస్కృతి, సినిమా మన అస్తిత్వానికి, వారసత్వానికి బలమైన మూలస్తంభాలు. తెలుగు సినిమా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తరతరాలకు స్ఫూర్తినివ్వాలి" అని ఆయన తన పోస్టులో ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారందరూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన పోస్ట్‌లో ప్రముఖ నటులు మమ్ముట్టి, యామీ గౌతమ్, కార్తీక్ ఆర్యన్, నిహారిక కొణిదెల, దర్శకుడు సుకుమార్‌లను ట్యాగ్ చేయడం విశేషం. దీంతో పాటు 'పుష్ప 2', 'కల్కి 2898 ఏడీ', 'లక్కీ భాస్కర్' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

## జానీమాస్టర్ వివాదం పరిష్కారం... నిషేధం ఎత్తివేసిన ఫెడరేషన్

టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొన్నాళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ఫిల్మ్ ఫెడరేషన్ మధ్యవర్తిత్వంతో శుభం కార్డు పడింది. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై విధించిన శాశ్వత నిషేధాన్ని ఫెడరేషన్ అధికారికంగా ఎత్తివేసింది. సినీ పెద్దలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ చొరవ చూపడంతో ఈ సమస్య సామరస్యంగా పరిష్కారమైంది.
ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ భేటీకి దర్శకులు, నిర్మాతల మండలి ప్రతినిధులతో పాటు జానీ మాస్టర్, డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత హాజరయ్యారు. వివాదానికి దారితీసిన పరిస్థితులపై జానీ మాస్టర్, సుమలత ఇచ్చిన వివరణతో ఫెడరేషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం జానీ మాస్టర్‌పై విధించిన నిషేధాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ, ఈ వివాదం కారణంగా ఎంతో మంది డ్యాన్సర్లు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న మెగాస్టార్ చిరంజీవికి, అండగా నిలిచిన నందమూరి బాలకృష్ణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవి స్వయంగా తనతో, శేఖర్ మాస్టర్‌తో మాట్లాడి సమస్యను అర్థం చేసుకున్నారని, బాలకృష్ణ కాకినాడ నుంచి ఫోన్ చేసి సర్దుకుపోవాలని సలహా ఇచ్చారని వివరించారు.అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ, డ్యాన్సర్ల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డ్యాన్సర్లు ఇచ్చే రూ.100 చందాతోనే అసోసియేషన్ నడుస్తోందని, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. సమస్య పరిష్కారానికి సహాయం చేసిన చిరంజీవికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.
ఇది తమ కుటుంబ సమస్య అని, ఇప్పుడు అంతా సద్దుమణిగిందని నిర్మాతల మండలి ప్రతినిధులు అన్నారు. అసోసియేషన్ నుంచి రాజీనామా చేసిన సభ్యులంతా తిరిగి కలిసికట్టుగా పనిచేస్తారని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జనరల్ సెక్రటరీపై చర్యల విషయంలో ఈ నెల 26న జరిగే జనరల్ బాడీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై సుమలత నాయకత్వంలోనే డ్యాన్సర్స్ అసోసియేషన్ కార్యకలాపాలు కొనసాగుతాయని ఆయన తేల్చిచెప్పారు. దీంతో యూనియన్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు పూర్తిగా తొలగిపోయాయి.

## గిరిపుత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

నిర్మించారు. బల్లగరువు, వెలగపాడులో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నూతన అంగన్వాడీ భవనాలు నిర్మించగా, కొరపర్తిలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ద్వారా అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ నిర్మించారు. అదనంగా కొరపర్తి గ్రామంలో ఎంపీపీ పాఠశాల భవనాన్ని పునరుద్ధరించారు. తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేసి, నీటి సరఫరా పైప్‌లైన్లు వేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు.
గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గిరిజనులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# వాడరేవు బీచ్ వద్ద ప్రమాదం.. యువకుడికి కాలు ఫ్రాక్చర్

**చీరాల, పెన్ పవర్, జూలై 19 :** బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు బీచ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అమరావతికి చెందిన గణేష్ (28) వాడరేవు బీచ్‌కు వచ్చిన సందర్భంగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో అతని ఎడమ కాలు ఫ్రాక్చర్ అయింది. సమాచారం అందుకున్న 108 వేటపాలెం అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. ఈ సహాయక చర్యల్లో 108 ఈఎంటీ చంద్ర గిరీష్ బాబు, పైలెట్ పి. షరీఫ్ పాల్గొని సకాలంలో స్పందించి బాధితుడికి అత్యవసర వైద్య సేవలు అందించారు. వారి వేగవంతమైన స్పందనతో గాయపడిన యువకుడిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించగలిగారు. వైద్యులు గణేష్‌కు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో ఇసుక దందాపై ప్రజలకు నిజాలు చెప్పాలి : జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి





**బాపట్ల, పెన్ పవర్, జూలై 19 :** బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, ప్రజా ప్రతినిధుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయని, ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి జిల్లాలో ఇసుక తవ్వకాలకు మంజూరు చేసిన అనుమతుల వివరాలు, అక్రమ తవ్వకాలపై నమోదైన కేసుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న వాహనాలు, యంత్రాల వివరాలు, ప్రజా ప్రతినిధులు లేదా ఇతర ప్రభావశీలులపై వచ్చిన ఆరోపణలపై విచారణ పురోగతి, అలాగే భవిష్యత్తులో అక్రమాలను అరికట్టేందుకు చేపట్టనున్న చర్యలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవాలు అధికారికంగా వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగడంతో పాటు చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకం మరింత బలపడుతుందని పేర్కొంటున్నారు. పారదర్శక పాలనకు కట్టుబడి జిల్లా యంత్రాంగం వీలైనంత త్వరగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇసుక వ్యవహారంపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు.

# వాడరేవు వైఎస్సార్ కాలనీలో పోలీసుల కర్టెన్ సెర్చ్

## 17 అనుమానాస్పద బైకులు స్వాధీనం

## గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన డీఎస్పీ మోయిన్






**చీరాల, పెన్ పవర్, జూలై 19 :** గంజాయి నిర్మూలనే లక్ష్యంగా బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చీరాల మండలం వాడరేవు పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో చీరాల సబ్‌డివిజనల్ పోలీసు సిబ్బంది విస్తృత స్థాయిలో కర్టెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కర్టెన్ సెర్చ్‌లో అనుమానాస్పదంగా ఉన్న 17 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చీరాల డీఎస్పీ మోయిన్ మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న బైకులకు సంబంధించి యజమానులు సరైన పత్రాలు సమర్పించిన తర్వాత వాటిని విడుదల చేస్తామని తెలిపారు. గంజాయి రహిత సమాజ నిర్మాణమే పోలీసు శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, పోలీసులతో కలిసి సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల రూరల్ సీఐ సుధాకర్ రావు, రూరల్ ఎస్ఐ రామాంజనేయులు, వన్‌టౌన్ ఎస్ఐలు హరిబాబు, శ్రీనివాసరావు, టూ టౌన్ ఎస్ఐ రాంబాబు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక దర్శి - అంబడిపూడికి రూ.6 కోట్ల బీటీ రోడ్డు

## ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పనులకు శ్రీకారం

**మార్టూరు, పెన్ పవర్, జూలై 19:** పర్చూరు నియోజకవర్గంలోని ఇసుక దర్శి నుంచి అంబడిపూడి వరకు రూ.6 కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. దశాబ్దాలుగా మెరుగైన రహదారి కోసం ఎదురుచూస్తున్న ఇసుక దర్శి, అంబడిపూడి గ్రామాల ప్రజల చిరకాల ఆకాంక్ష ఈ ప్రాజెక్టుతో నెరవేరనుంది. రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ రహదారి ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు వేగంగా తరలించుకునే అవకాశం లభించనుంది. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవల రాకపోకలు కూడా సులభతరం కానున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్చూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నెల్లూరు జాయింట్ కలెక్టర్ ప్రత్యేక పూజలు



**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 19 :** పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న జేసీ మొగిలి వెంకటేశ్వర్లుకు ఆలయ ధర్మకర్త సీహెచ్. విజయకుమార్, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనం కల్పించి, శాలువాతో సత్కరించారు. జేసీ కుటుంబ సభ్యులతో కలిసి బాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా జేసీ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “శ్రీ షిర్డీ సాయిబాబాను దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను కలిగించింది. భక్తి భావంతో బాబాను దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను” అని అన్నారు. ఆలయ నిర్వహణతో పాటు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పోపూరి శేషగిరిరావు, కంచర్ల శ్రీనివాసరావు, కరణం శివ, కట్ట జవహార్ బాబు, కాసిం, పావులూరు వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు బాబా ప్రసాదాలను పంపిణీ చేశారు.

# జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహణ

## ప్రజలు 1100 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్



**బాపట్ల, పెన్ పవర్, జూలై 19 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ -- పీజీఆర్ఎస్)తో పాటు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. ఈరోజు (సోమవారం జులై 20) ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో గతంలో స్వీకరించిన పిటిషన్ల పరిష్కారంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సమర్పించిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా వాటి స్థితిగతులను తెలుసుకోవాలనుకున్నా, అర్జీదారులు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1100కు కాల్ చేయవచ్చని తెలిపారు. అలాగే మీకోసం డాట్ ఏపి డాట్ జీఓవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# పేటలో ఆటో బోల్తా

## ఐదుగురు ప్రయాణికులకు గాయాలు

**చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 19 :** పట్టణ పరిధిలోని పురుషోత్తమ పట్నం వినాయక గుడి వద్ద ఆదివారం మధ్యాహ్నం సుమారు 3:00 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న ఆటో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న మరో ఆటో ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో సహా ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొప్పూడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేముల కోటేశ్వరరావు (56), తన ఆటోలో (ఏపీ 27 యూఏ 0188) ఐదుగురు ప్రయాణికులను ఎక్కించుకుని ‘తండ్రి సన్నిధి’ నుండి కళామందిర్ సెంటర్‌కు బయలుదేరాడు. ప్రయాణికులంతా ఆదివారం ప్రార్థనలు ముగించుకుని తిరిగి వస్తుండగా పురుషోత్తమ పట్నం వినాయక గుడి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే చిలకలూరిపేటలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కోటేశ్వరరావుకు నుదురు, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. ప్రయాణికుల్లో బోయటమందూరు గ్రామానికి చెందిన తోకచెంచు నాగేంద్రం (60) తలకు తీవ్ర గాయమై చెవుల నుండి రక్తం కారడంతో, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాసు వెంగళరెడ్డి నగర్‌కు చెందిన మేడికొండి చంద్ర (52) ఛాతీకి బలమైన గాయమైంది. అలాగే పర్చూరు సమీపంలోని నాగులపాలెంకు చెందిన పలపర్తి మేరీ (38) తలకు, ఆమె సోదరి, ఇంకొల్లుకు చెందిన పలేపు వెంకాయమ్మ (46) నుదుటిపై గాయాలపాలయ్యారు. మరో ప్రయాణికుడికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం వీరికి ఆసుపత్రిలో చికిత్స అందుతోంది.



# చీరాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల నాటడం




**చీరాల, పెన్ పవర్, జూలై 19 :** పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఆదివారం వై.ఏ. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పండ్ల మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినుల సమక్షంలో జామ, నేరేడు, మామిడి, సీతాఫలం తదితర పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గాలి, నీరు, భూమి, చెట్లు మానవ మనుగడకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆధునిక అభివృద్ధి పేరుతో అడవుల నరికివేత, కాలుష్యం పెరగడం వల్ల భూమి వేడెక్కి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ చీరాల 3150 జిల్లా గవర్నర్ ఉదయ్ సుధీర్ పిలాని పిలుపు మేరకు అన్ని రోటరీ క్లబ్‌లు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, కార్యదర్శి చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ డా. బాబూరావు, బండారుపల్లి హేమంత్ కుమార్, జాలాది కృష్ణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, గుర్రం రాఘవరావు, గుద్దంటి రమేష్, ప్రసాద్, సురేష్, మొక్కల శ్రీను, వీరాంజనేయులు, లాల్, శంకరరెడ్డి, శ్రీనివాసరావు, అధ్యాపకురాలు భారతి, విద్యార్థినులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా పౌరసరఫరాల సంస్థకు కొత్త జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్. గణనాథ్



**బాపట్ల, పెన్ పవర్, జూలై 19 :** బాపట్ల జిల్లా పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లైస్) జిల్లా మేనేజర్‌గా ఆర్. గణనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటివరకు బాపట్ల జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వహించిన శ్రీలక్ష్మి విజయవాడకు బదిలీ కాగా, ఆమె స్థానంలో విజయవాడ హెడ్ ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్. గణనాథ్ బదిలీపై బాపట్ల జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది ఆర్. గణనాథ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# చల్లారెడ్డిపాలెంలో ముగింపు దశలో జల్ జీవన్ మిషన్ పనులు

## త్వరలో ఇంటింటికీ మంచినీటి సరఫరా

**చీరాల, పెన్ పవర్, జూలై 19:** చీరాల నియోజకవర్గంలోని చల్లారెడ్డిపాలెం గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులు ముగింపు దశకు చేరుకున్నాయని చల్లారెడ్డిపాలెం పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణచంద్రరావు తెలిపారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులు త్వరలో పూర్తికానుండగా, అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం గ్రామాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని కీర్తి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.



# పేకాట రాయుళ్ల అరెస్టు

### చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక..



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 19:** మండల పరిధిలోని బొప్పూడి గ్రామంలోని జాతీయ రహదారి (ఎన్ హెచ్-16) పక్కన ఉన్న పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ. 13,200 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, చిలకలూరిపేట మండల పరిధిలో ఎవరైనా సరే కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేసిన గజవల్లి శ్రీనివాసరావు



**చీరాల, పెన్ పవర్, జూలై 19:** బాపట్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష నియామక ప్రక్రియపై ఆర్యవైశ్య ప్రముఖుడు గజవల్లి శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. చీరాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఆర్యవైశ్య పెద్దలు తన పేరును అధ్యక్ష పదవికి ప్రతిపాదించినప్పటికీ, సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మరో వ్యక్తికి నియామక పత్రం అందజేశారని ఆరోపించారు. జిల్లాలోని 20 మండలాల ప్రతినిధుల్లో 16 మంది తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపినప్పటికీ, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. సంబంధిత ప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నియామక ప్రక్రియ పూర్తి చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను వాసవి అమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యా, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్నానని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష నియామకాలు సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ వ్యవహారంపై సంబంధిత పెద్దలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గజవల్లి శ్రీనివాసరావు కోరారు.

## బుడమేరు కాలువలో ఇద్దరి గల్లంతు

### వలస కార్మికులుగా గుర్తించిన పోలీసులు



ఒకే చోట పని చేసే ఇద్దరు తాగిన మైకంలో సరదాగా నీటిలో దూకినందుకు కనిపించకుండా పోయారు. సేకరించిన వివరాల మేరకు.. విశాఖ జిల్లా ములగాడ మండలం చింతలలోయ గ్రామానికి చెందిన ఏలుబంటి వాసు(25), విశాఖ పట్నంలోని గాజువాక వాంబేకాలనీ భానోజీతోటకు చెందిన బైనిబిల్లి కృష్ణారావు(50) కొండపల్లి పారిశ్రామికవాడలోని రేకుల కంపెనీలో పని చేయడానికి గుత్తేదారుని ద్వారా కొంతకాలం కిందట ఇక్కడికి వచ్చారు. అప్పటి నుంచి స్థానిక శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం కంపెనీకి సెలవు కావడంతో సాయంత్రం బిర్యానీ తెచ్చుకొని కాలనీ సమీపంలోని బుడమేరు కాలువ వంతెన వద్దకెళ్లారు. బిర్యానీ తినేటప్పుడు మద్యం తాగి, తర్వాత చల్లగా ఉంటుందన్న ఉద్దేశంతో బుడమేరులో దిగారు. కాలువలో ప్రస్తుతం పట్టిసీమ నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఏం జరుగుతుందో వారు తెలుసుకునేలోగా ప్రవాహానికి కొట్టుకుపోయారు. స్థానికులు బుడమేరు వద్దకొచ్చి చూడగా ఇద్దరూ కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక, పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వారి ఆచూకీ కోసం ప్రయత్నించారు. అప్పటికే రాత్రి కావడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. సోమవారం ఉదయం ఎన్టీటీపీఎస్‌లోనైనా, యాక్టివ్ పవర్ గేట్ల వద్దనైనా ఇద్దరు కనిపిస్తారని పోలీసులు భావిస్తున్నారు. వీరిని విశాఖ నుంచి తీసుకొచ్చిన గుత్తేదారుని వద్ద వివరాలు సేకరించిన పోలీసులు అక్కడి వారికి సమాచారం ఇచ్చారు.

# నదుల అనుసంధానంపై పార్లమెంట్‌లో చర్చించాలి : లావు శ్రీకృష్ణ దేవరాయలు



దేశంలో నదుల అనుసంధానంపై మొదటి నుంచి సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ లోక్‌సభా పక్ష నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు వ్యాఖ్యానించారు. ఆదివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్‌లో నదుల అనుసంధానంపై చర్చ జరగాలని సూచించారు. అన్ని పార్టీలు నదుల అనుసంధానంపై చర్చలో పాల్గొనాలని అన్నారు. గోదావరి, పెన్నా నదులను అనుసంధానించాలని తెలిపారు. ఆక్వా రైతుల ఫీడ్ ధరలు తగ్గించాలని చెప్పారు. పడిపోయిన పొగాకు ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పొగాకు రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని చెప్పుకొచ్చారు.

**వాటిపై కొత్తగా చట్టాలు తీసుకురావాలి:** సోషల్ మీడియాలో వ్యక్తిగత హననంపై పార్లమెంటులో స్వల్ప కాలిక చర్చ జరగాలని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. రాజకీయ నేతలు, సెలబ్రిటీలే కాకుండా సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత హననానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంపైన కొత్తగా చట్టాలు తీసుకురావాలని సూచించారు. వీటిపైన పార్లమెంట్‌లో చర్చించాలని అన్నారు. మ్యూల్ అకౌంట్స్, ఆన్‌లైన్ మోసాలు, షెల్ కంపెనీలతో ప్రజలు నష్టపోతున్నారని.. దీనిపై చర్చ జరగాలని చెప్పారు. పోలవరం, అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. 2027 మార్చి నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దాని తర్వాత సెకండ్ ఫేస్ పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీలో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను రూ. 60 వేల కోట్లతో గుర్తించామని చెప్పారు. తదుపరి ఎన్నికలకు వెళ్లే ముందే వీటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు.

**ఏపీ అభివృద్ధిని వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారు:** ఏపీలో ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు పార్లమెంట్ సమావేశాల్లో అంశాలను లేవనెత్తాలని చంద్రబాబు సూచించారని లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉచ్చులో పడి గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారని ప్రస్తావించారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు ఈసారి పాస్ అవుతాయని ఆశిస్తున్నానని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై బురద జల్లుతున్నారని ఆగ్రహించారు. దేశం, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారని అన్నారు. గుంటూరులో మహిళపై జరిగిన ఘటనను ఖండిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అమరావతి రాజధానిగా కేంద్రం నోటిఫై చేస్తే. వైసీపీ వ్యతిరేకించిందని లావు శ్రీకృష్ణ దేవరాయలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఫ్లయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ మోసంలో కొత్తకోణాలు

### సిబ్బందితోనే ఇంటర్వ్యూల తంతు అంతా బోగస్!

ఫేక్ లింకులు పంపించి.. విదేశీ కంపెనీల ప్రతినిధుల పేర్లతో లాగిన్లు క్రియేట్ చేసి బోగస్ ఇంటర్వ్యూలు చేశారు. ఆనక.. ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదంటూ బోగస్ లెటర్ పంపిస్తారు.. ఇలా వందల మంది నుంచి డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించారు నిర్వాహకులు సౌజన్య, ఆమె భర్త శ్రీనివాస్. ఐరోపా దేశాల్లో ఆకర్షణీయ జీతమంటూ పెద్ద సంఖ్యలో నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేసిన 'ఫ్లయింగ్ బోర్డర్స్' మోసాల్లోని వివిధ కోణాలు వెలుగుచూస్తున్నాయి. సౌజన్య ల్యాప్‌టాప్‌లో కీలక ఆధారాలు లభించాయి.

**విదేశీయుల పేర్లతో మెయిల్ ఐడీలు:** డబ్బులు వసూలు చేసిన ప్రతి ఒక్కరికి రెండు వాయిస్, ఒక వీడియో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిని మైక్రోసాఫ్ట్ టీమ్స్ ద్వారా చేశారు. దీని ద్వారా అభ్యర్థులకు లింక్ పంపించి బోగస్ ఇంటర్వ్యూల తంతును ఇక్కడి నుంచే నడిపించారు. అగతా జేన్, కెరోల్ మెథ్యూస్, క్లారా లారెంట్ పేర్లతో జీమెయిల్‌తో పాటు అవుట్‌లుక్‌లో వీటిని క్రియేట్ చేశారు. వీరు విదేశీయులే అని నమ్మించేందుకే ఇదంతా చేశారు. నకిలీ మెయిల్ ఐడీలతో టీమ్స్ సాఫ్ట్‌వేర్‌లోకి వెళ్లి ఎకౌంట్ క్రియేట్ చేసి నిరుద్యోగులకు లింకులు పంపించేవారు.

**గూగుల్‌కు లేఖ:** నకిలీ జీమెయిల్స్ గుట్టు రట్టు చేసే పనిలో పోలీసులు ఉన్నారు. విదేశీ పేర్లతో ఐడీలు రూపొందించిన వైనంపై మరింత సమాచారం కోసం గూగుల్‌కు లేఖలు పంపించనున్నారు. వీటిని ఎవరు ఎప్పుడు క్రియేట్ చేశారు? ఈ ఎకౌంట్లకు లింక్ అయిన ఫోన్ నంబర్లు ఏవి? తదితర వివరాలను తీసుకోనున్నారు.

**మహిళా సిబ్బందికి ఇతర భాషలపై శిక్షణ:** విదేశీ యాసలో మాట్లాడేందుకు కార్యాలయంలో పనిచేసే ముగ్గురు మహిళా ఉద్యోగులకు శిక్షణ కూడా ఇప్పించారు. ఇక్కడే తర్ఫీదు కూడా పొందారు. వీరు శిక్షణ పొందుతున్న వాయిస్ రికార్డులు కూడా సౌజన్య ల్యాప్‌టాప్‌లో దొరికాయి. ఈ ల్యాప్‌టాప్ నుంచే విదేశీ కంపెనీల ప్రతినిధుల పేర్లతో లాగిన్ అయినట్లు గుర్తించారు. ఇంటర్వ్యూ తంతు ముగిసిన తర్వాత మీరు ఎంపిక కాలేదని అభ్యర్థికి పంపించే లేఖను చాట్‌జీపీటీలో రూపొందించారు. ఈ ఆధారాలను కూడా పోలీసులు సేకరించారు. కేవలం పేర్లు మార్చి అందరికీ ఒకటే లేఖ పంపారు. ఒకే టెంప్లేట్‌లో వీటిని రూపొందించారు. ఈ ముగ్గురు ఉద్యోగులు ఎవరు? అన్న దానిపై దృష్టి పెట్టారు. వీరిని ప్రశ్నిస్తే మరిన్న వివరాలు బయటకొచ్చే అవకాశం ఉంది.

## కమనీయం.. రథోత్సవం

విజయవాడలో పూరీ జగన్నాథుడి రథయాత్ర ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. భజనలు, హరినామ సంకీర్తనల నడుమ సాగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 5 వేల కిలోల లడ్డూతో ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఇస్కాన్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ముందుగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిని దర్శించుకొని కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ ఏటా నిర్వహించే జగన్నాథుడి రథయాత్ర భారతీయ సంస్కృతి, సనాతన ధర్మపరిరక్షణకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాల ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీత గ్రంథాలు, స్వామివారి చిత్రపటాలను భక్తులకు పంపిణీ చేశారు. భాజపా నాయకుడు పాతూరి నాగభూషణం, గజల్ శ్రీనివాస్, విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, ఇస్కాన్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటీకరణ అంటూ వైసీపీ ప్రచారం

### స్పందించిన ప్రభుత్వం

రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటీకరణ అంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు అసత్యమని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దుష్ప్రచారాన్ని ప్రభుత్వం ఆదివారం ఖండించింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ద్వారా సేవలు మరింత సులభతరం చేస్తున్నట్లు వివరించింది. సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరగడం లేదంటూ ప్రభుత్వం వివరించింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ అధికారాలన్నీ ప్రభుత్వ శాఖ వద్దే ఉంటాయని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలోనే పనిచేస్తాయని వెల్లడించింది. డాక్యుమెంట్ పరిశీలన, ఆమోదం, డిజిటల్ సంతకం, రిజిస్ట్రేషన్‌ను సబ్-రిజిస్ట్రార్లే నిర్వహిస్తారని పేర్కొంది. డేటా, రికార్డులు పూర్తిగా రిజిస్ట్రేషన్ శాఖ ఆధీనంలోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో ఫెసిలిటేషన్ ఛార్జీ గరిష్ఠంగా రూ. 2 వేలు మాత్రమేనని వివరించింది. మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గి పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్, అడ్వాన్స్ స్లాట్ బుకింగ్, ఇంటిగ్రేటెడ్ పేమెంట్ వంటి సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపింది. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడమే లక్ష్యమని ప్రభుత్వం వివరించింది.

# ఎత్తిపోతలపై ఎల్‌నినో దెబ్బ

### కృష్ణా, మునేరు, వైరాలో కనిపించని నీటిజాడ ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు రైతుల అవస్థలు

ఎత్తిపోతల పథకాలపై ఎల్‌నినో పడగ విప్పింది. ఓ వైపు కృష్ణా నదితో పాటు జిల్లా ఎత్తిపోతల పథకాలకు జీవనాధారమైన మునేరు, వైరాల్లో కూడా నీటి జాడ కనిపించడం లేదు. ఫలితంగా ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు చేసే ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పంటలు వేసిన వారు నష్టాల బాటలో ఉన్నారు.

**సాగునీటికి కటకట:** వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకం కింద నందిగామ, జగ్గయ్యపేట పరిధిలో 30వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నీరు లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తారకరామా ఎత్తిపోతల పథకం కింద ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ గ్రామీణ పరిధిలో 13వేల ఎకరాలకు నీరందక రైతులు అయోమయంలో ఉన్నారు. పెనుగంచిప్రోలు ఎత్తిపోతల పథకం ద్వారా 2వేల ఎకరాలకు నీరు చేరుతుంది. ఎత్తిపోతల నుంచి గ్రామంలోని చెరువు నిండితే మరో వెయ్యి ఎకరాలకు నీరు అందుతుంది. మునేరులో చుక్క నీరు లేక చెరువు కూడా అడుగంటుతోంది. పోలంపల్లి-1,2, మాగల్లు, శనగపాడు, వెంకటాపురం, రాఘవాపురం ఎత్తిపోతల పథకాల్లో నీరు లేదు.

**1.31 లక్షల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం:** ఉమ్మడి జిల్లాలో మొత్తం 137 ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింద 1.31లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎగువ నుంచి వరద నీరు ప్రాజెక్టుల్లో చేరుతుందన్న ఉద్దేశంతో రైతులు చాలా రోజుల కిందటే సాగు మొదలు పెట్టారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, కంచికచర్ల తదితర మండలాల్లో ఎత్తిపోతల పరిధిలోని పొలాల్లో దాదాపు 20వేల ఎకరాల్లో వరి నారుమళ్లు, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాలు, ఇతర ఉద్యాన పంటల సాగు చేశారు. చెదురుమదురు వర్షాలకు మొక్కలు వచ్చాయి.

**వాడిపోతున్నాయ్:** ప్రస్తుతం వర్షాలు లేక..ఎగువ నుంచి ఎత్తిపోతల పథకాలకు నీరు చేరకపోవటంతో పత్తి, మిర్చి, వరినారు వాడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. నీరు లేక చేను బలానికి వేసిన పచ్చిరొట్ట ఎరువులు కనీసం మొలకలు రాక ఎకరానికి రూ. 5వేల వరకు నష్టం వాటిల్లింది. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉంటే పంటలు ఎందుకూ పనికిరావు. జిల్లాలో పోపూరు, కాసరబాద, కుక్కునూరు, కొడవటికల్లు, పున్నవల్లి-1,2, వెలది కొత్తపాలెం, చింతలపాడు-2, విభరింతలపాడు, ఏటూరు, మున్నలూరు, కంచికచర్ల, మోగులూరు వంటి అనేక ఎత్తిపోతల పథకాలకు కృష్ణా నది ఉధృతంగా వస్తేనే నీరు అందుతుంది. ప్రస్తుతం వాటిల్లోనూ నీరు లేదు.

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చరిత్రలో సువర్ణ అధ్యాయం ప్రారంభం : అబ్దుల్ అజీజ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చరిత్రలో సువర్ణ అధ్యాయం మొదలైందని ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీ వక్ఫ్ బోర్డుకు రికార్డులు బదిలీ అయ్యాయని ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. 79 బండిళ్లలోని 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ సంపుటాలు సహా కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన రూ. 55 కోట్ల బకాయిలు కూడా త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు. పట్టుదల, నిరంతర ప్రయత్నంతో రికార్డుల బదిలీ సాధించామని ఆయన చెప్పారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఇది కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో ఈ విజయం సాధించామని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

# ఇసుక దర్శి - అంబడిపూడికి రూ.6 కోట్ల బీటీ రోడ్డు

### ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పనులకు శ్రీకారం



**మార్టూరు, పెన్ పవర్, జూలై 19 :** పర్చూరు నియోజకవర్గంలోని ఇసుక దర్శి నుంచి అంబడిపూడి వరకు రూ. 6 కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. దశాబ్దాలుగా మెరుగైన రహదారి కోసం ఎదురుచూస్తున్న ఇసుక దర్శి, అంబడిపూడి గ్రామాల ప్రజల చిరకాల ఆకాంక్ష ఈ ప్రాజెక్టుతో నెరవేరనుంది. రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ రహదారి ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలకు వేగంగా తరలించుకునే అవకాశం లభించనుంది. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవల రాకపోకలు కూడా సులభతరం కానున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పర్చూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆటో బోల్తా ఐదుగురికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం : మండలంలోని తిరుపతి-- 49 కొత్తపల్లిమిట్ట రోడ్డులోని కటికపల్లి వద్ద ఆదివారం ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని డి.కే.మర్రిపల్లికి చెందిన గ్రామస్తులు నగరిలోని సమీప బంధువుల ఇంటిలో జరుగుతున్న శుభకార్యంలో పాల్గొనేందుకు బయలుదేరారు. కటికపల్లి వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో పి.సోకమ్మ, పి.ఇంద్రాని, పి.పిచ్చమ్మ, అములు, చెంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

## గుంటూరు ఘటనపై హోం మంత్రి అనిత సీరియస్

గుంటూరులో ఓ మహిళపై దాడికి పాల్పడిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా ఎస్పీతో అనిత మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యం వహించిన పోలీసులపైనా చర్యలకు హోం మంత్రి ఆదేశించారు. ఈ ఘటన జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడంలో సీఐ ఎందుకు నిర్లక్ష్యం చేశారని హోం మంత్రి ప్రశ్నించారు. ఆడబిడ్డల జోలికొస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హోం మంత్రి హెచ్చరించారు. నేరస్థులను నేరస్థులుగానే చూడాలి.. తప్ప పార్టీల పరంగా చూడరాదని తేల్చిచెప్పారు. ఆయా పార్టీల ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు.

# రాజధాని అసైన్డ్ భూముల కేసులో చంద్రబాబు, నారాయణకు హైకోర్టులో ఊరట

అమరావతి, జులై 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పి. నారాయణపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులు రాజకీయ కక్ష సాధింపేనని ఏపీ హైకోర్టు వెల్లడించింది. గురువారం రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో హైకోర్టు విస్పష్టమైన తీర్పు వెలువరించింది. పరిపాలనా పరమైన నిర్ణయాలకు నేరపూరిత చర్యలను ఆపాదించడానికి వీలు లేదని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. అలా చేస్తే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. చట్ట నిబంధన అనుసరించే జీవో నంబర్ 141 తీసుకొచ్చారని వివరించింది. జీవో వల్ల నష్టపోయామని రైతులు ఎవరు కోర్టును ఆశ్రయించ లేదని వివరించింది. ఏపీ సీఆర్డీఏ చట్టం ప్రకారం తీసుకున్న నిర్ణయాలన్నింటికీ చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది. ప్రాసిక్యూట్ చేయడాన్ని చట్టంలోని సెక్షన్ 146 నిషేధిస్తుందని తెలిపింది. చంద్రబాబు, మంత్రి నారాయణలను యాంత్రికంగా, దౌర్జన్య పూరితంగా నిందితులుగా చేర్చారని వివరించింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదులో దురుద్దేశం తప్ప, ప్రజాప్రయోజనం లేదని స్పష్టం చేసింది. పిటిషనర్లపై మోపిన ఆరోపణలన్నీ నిరాధరమైనవే అని ఏపీ హైకోర్టు వెల్లడించింది. అందువల్లే పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో చంద్రబాబు, నారాయణలపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విదితమే.

# ఎస్సీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు

**హాస్టల్ వదిలి వెళ్లిపోయిన వార్డెన్**

**విద్యార్థులు ప్రశ్నిస్తే బాధ్యతారాహిత్యంగా సమాధానం**

**ఆకలితో అల్లాడిపోయిన విద్యార్థులు**

**ఎస్‌వీఎన్ కాలనీ ఎస్సీ హాస్టల్‌లో ఈనెల 17న ఘటన**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం**

నెహ్రూనగర్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమం గాల్లో దీపంగా మారింది. అధికారులు, వార్డెన్ల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా శుక్రవారం రాత్రి గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో హృదయవిదారక ఉదంతం చోటుచేసుకుంది. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోగా, ఉన్న కాస్త అన్నం, కూర కూడా అయిపోవడంతో సుమారు 20 మందికి పైగా విద్యార్థులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై విద్యార్థులు వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చి చర్చనీయాంశంగా మారింది.

**కూర లేదు.. అన్నం లేదు.. నీళ్ల చారే దిక్కు:** మెను ప్రకారం రోజువారీ ఆహారం పెట్టకుండా నిబంధనలను పక్కనబెట్టి నాణ్యత లేని టమాటా కూర, నీళ్లలాంటి చారును వండారని విద్యార్థులు వాపోయారు. తీరా రాత్రి 8 గంటల సమయానికే కూర, అన్నం పూర్తిగా అయిపోయాయి. అప్పటికే ఆకలితో ఉన్న సుమారు 20 మంది విద్యార్థులు తినడానికి తిండి లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వండిన కూర నీళ్ల సాంబారులా ఉందని, అన్నంలో నీళ్లు కలుపుకొని తినాల్సిన దుస్థితి వచ్చిందని విద్యార్థులు వాపోయారు.

**వార్డెన్ బాధ్యతారాహిత్యం:** హాస్టల్‌లో విద్యార్థులకు భోజన వసతి సరిగ్గా అందుతుందో లేదో చూడాల్సిన వార్డెన్ రాత్రి 7:45 గంటలకే హాస్టల్ వదిలి వెళ్లిపోయారని విద్యార్థులు ఆరోపించారు. హాస్టల్‌లో అన్నం, కూర అయిపోయి విద్యార్థులు ఆకలితో అలమటిస్తుంటే.. విద్యార్థులు వార్డెన్‌కు దాదాపు 10 సార్లు ఫోన్ చేసినప్పటికి స్పందించలేదని ఆరోపించారు. చివరకు అరగంట తర్వాత ఫోన్ ఎత్తిన వార్డెన్.. తాను కూరగాయలు తెచ్చి హాస్టల్‌లో పెట్టి హాస్పిటల్‌కి వచ్చానని సాకులు చెప్పడంపై విద్యార్థులు మండిపడుతున్నారు. రాత్రి 9 గంటలైనా భోజనం లేదని, తాము ఏం తినాలని విద్యార్థులు నిలదీయగా.. 'రేపు పొద్దున వండిస్తానయ్యా' అంటూ వార్డెన్ అత్యంత బాధ్యతారాహిత్యంగా సమాధానమిచ్చారు. విద్యార్థులు తమ బాధను వివరిస్తుండగానే వార్డెన్ ఫోన్ కట్ చేయడం వారి పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది.

**తెల్లారితే పరీక్షలు.. రాత్రంతా పస్తు పడుకోవాల్సిన దౌర్భాగ్యం:** ఉదయం తమకు పరీక్షలు ఉన్నాయని, రాత్రంతా ఆకలితో ఉంటే పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు వీడియోలో వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విద్యార్థుల ఆకలి తీర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, హాస్టల్‌లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం వెలుగులోకి వచ్చిన వీడియోపై జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి హర్షితను వివరణ కోరగా ఆమె స్పందించలేదు.

# గుంటూరు జీజీహెచ్‌లో కొవిడ్ కలకలం

**ఒక పాజిటివ్ కేసు నమోదు**

**ప్రత్యేకవార్డులో బాధితుడికి చికిత్స**

గుంటూరు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఒక కొవిడ్ పాజిటివ్ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలానికి చెందిన వ్యక్తికి తీవ్ర జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో ఆదివారం జీజీహెచ్‌కు వచ్చారు. బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది బాధితుడిని వెంటనే స్టెప్‌డౌన్ ఐసీయూలోని ప్రత్యేక కొవిడ్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**ఆసుపత్రిలోనూ పటిష్ఠ చర్యలు:** కొవిడ్ కేసు నమోదు కావడంతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ వెంటనే స్పందించి, ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ముందస్తుగా కీలక చర్యలు చేపట్టారు.

**ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు:** సోమవారం నుంచి అత్యవసర వైద్య విభాగం వద్దే అనుమానిత లక్షణాలు ఉన్న వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహించేలా ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వైద్య సామగ్రి సిద్ధం: ఆసుపత్రిలో తగినన్ని కొవిడ్ పరీక్ష కిట్లు, పీపీఈ కిట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక పర్యవేక్షణ:** ఆసుపత్రికి వచ్చే రోగుల్లో ఎవరికైనా తీవ్రజ్వరం, శ్వాసకోశ సమస్యలు ఉంటే వెంటనే పరీక్షలు చేయాలని సూచించారు. జీజీహెచ్‌లో కొవిడ్ కేసు నమోదైన నేపథ్యంలో రోగులు, వారి సహాయకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్పటికే, మంగళగిరిలో ఇద్దరు మహిళలు కొవిడ్‌తో హోమ్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా.. ఎయిమ్స్‌లో ఒక వృద్ధురాలికి చికిత్స అందిస్తున్నారు.

# హత్య కేసులో నిందితులు అరెస్ట్

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ నాజరుపేటలో ఈ నెల 15వ తేదీ పొద్దుపోయాక కొల్లిపర కోటేశ్వరరావును అని తల్లిదండ్రులు భాస్కరరావు, బుల్లెమ్మ, తమ్ముడు మరియదాసు దాడి చేసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య జరిగిన నేపథ్యం, దారి తీసిన ఘటనలు వంటి వివరాలను సోమవారం నిర్వహించనున్న విలేకర్ల సమావేశంలో అధికారులు వెల్లడించనున్నారు.

# వ్యవసాయ డిప్లొమా కోర్సులకు రెండో విడత వెబ్ ఆప్షన్లు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలల్లో వ్యవసాయ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు గతంలో ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 21, 22వ తేదీలలో రెండవ విడత వెబ్ ఆప్షన్‌లను నమోదు చేసుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.మణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# ఆటో బోల్తా - ఐదుగురికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పురుషోత్తమపట్నం వినాయక గుడి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న ఆటో ఢీకొని బోల్తా పడింది. ఆటో డ్రైవర్ వేముల కోటేశ్వరరావుతోపాటు ప్రయాణికులు తోక చెంచు, నాగేంద్రం, మేడికొండి చంద్ర, పలపర్తి మేరీ, పలేపు వెంకాయమ్మలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నాగేంద్రంను మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందుతోంది. బాధితులంతా ఆదివారం ప్రార్ధనలు ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

# రైలు కింద పడి మహిళ బలవన్మరణం

చీరాల రూరల్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య ఆదివారం వివరాలు తెలిపారు. ఒంగోలు మరాఠీపాలేనికి చెందిన అనంత ఇందిరాదేవి (56) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. అయితే మందులు వాడుతున్నప్పటికీ వ్యాధి తీవ్రత తగ్గకపోవడంతో ఇక వ్యాధి ఎప్పటికీ తగ్గదేమోనని భావించి జీవితంపై విరక్తి చెందింది. వేటపాలెం--చినగంజాం రైల్వేస్టేషన్ల మధ్య మూడో లైన్‌లో గుర్తు తెలియని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వినుకొండ తిరునాళ్లలో 500 మందితో బందోబస్తు

ఈనెల 25న తొలి ఏకాదశికి వినుకొండలో జరగనున్న శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి తిరునాళ్లకు ముందుగానే ఆంక్షలు అమల్లోకి తెస్తున్నట్లు నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. ఆదివారం కొండపై ఏర్పాట్లను పట్టణ సీఐ ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఒక డీ...ఎస్పీ, 9 మంది సీఐలు, 23 మంది ఎస్సైలతో పాటు 450 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలకు ఆంక్షలతో కూడిన అనుమతి ఇస్తున్నామన్నారు. కొండపైకి ఆర్టీసీ బస్సులు, ప్రభుత్వ శాఖల అధికారుల వాహనాలను మాత్రమే అనుమతిస్తామని, ప్రైవేటు వాహనాలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కొండకు 3 కిలో మీటర్ల పరిధిలో వైన్ షాపులు, బెల్ట్ షాపులు, బార్లకు అనుమతులు లేవన్నారు. కొండ వద్ద వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్యూలైన్లకు సరిపడేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖాధికారులకు సూచించారు. ప్రజలు పోలీసుల ఆంక్షలకు లోబడి నడుచుకోవాలన్నారు. ప్రభలు, ఎన్నెస్పీ కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలను జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అన్నింటికీ ముందుగానే అనుమతులు తీసుకోవాలని లేనిచో ఎంతటి వాటినైనా నిలిపేస్తామన్నారు. చెడు నడత గతగల వారిని ముందుగా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ముందుగా అదుపులోకి తీసుకుంటామన్నారు. 24వ తేదీ నుంచి రోడ్ల వెంబడి ఎలాంటి వాహనాలు నిలపకూడదని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బ్రహ్మయ్య, ఈవో సుధాకరరెడ్డి, పీవీ సురేష్, భాగవతుల రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమా న్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నేడు పోలీసు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని వన్‌టౌన్ పక్క న్న ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు నేరుగా తనను కలిసి సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నేడు డయల్ యువర్ ఎస్‌ఈ

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ అమర్‌బాబు తెలిపారు. వినియోగదారులు ఉదయం 8.30--9.30 గంటల మధ్య 7993147979 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని వివరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# తెగిన బంధం.. కన్నీటి సంద్రం

**విశాఖ జిల్లాలో ప్రమాదం.. నలుగురి మృతి**

**ఇనుమెళ్ల, ముప్పాళ్లలో విషాద ఛాయలు**

**ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు**

శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ట్రాఫిక్ అధికారి ఇంట్లో ఆదివారం జరిగే శుభకార్యానికి పల్నాడు జిల్లాకు చెందిన స్నేహితుల బృందం శనివారం సాయంత్రం కారులో బయలుదేరింది. మరో రెండు గంటల్లో గమ్యస్థానానికి చేరుకుంటామనగా లారీ రూపంలో మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లా బ్రపుకొత్తూరులో జరిగే శుభకార్యానికి నరసరావుపేటలోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో పనిచేస్తున్న ఈపూరు మండలం ఇనుమెళ్లకు చెందిన మందపాటి చంద్రశేఖర్, ఆయన కుమారుడు భవానీశంకర్ (11), అదే గ్రామానికి చెందిన స్నేహితులైన పాలగాని రామాంజనేయులు (51), షేక్ మీరావలి (56), ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన మొగతపురపు శ్రీనివాసరావు (50) (డ్రైవర్) కారులో శనివారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం సత్తరవు కూడలి పైవంతెన వద్దకు రాగానే ముందు వెళుతున్న లారీ డ్రైవర్ వేగం తగ్గించడం, ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా ఎడమ వైపునకు తిప్పే ప్రయత్నం చేయడంతో వెనుక నుంచి వస్తున్న కారు వేగం అదుపు చేయలేక బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు డ్రైవర్ శ్రీనివాసరావు, ముందు సీట్లో కూర్చున్న రామాంజనేయులు, వెనుక సీట్లో ఉన్న షేక్ మీరావలి, భవానీ శంకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారు వెనుక సీట్లో కూర్చున్న చంద్రశేఖర్ ముందు సీట్ల మధ్య భాగంలో ఇరుక్కోవడంతో తీవ్ర గాయాలతో బయటపడ్డారు.

ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం జరగ్గా. ఓ వాహనచోదకుడి ద్వారా 108 వాహనానికి 4.15 గంటలకు సమాచారం చేరింది. జాతీయ రహదారిలోకి ప్రవేశించి సంఘటనా స్థలానికి చేరుకోవడానికి సిబ్బందికి 20 నిమిషాల సమయం పట్టింది. వీరితో పాటు హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు అరగంటపాటు శ్రమించి కారులో నుంచి మృతులు, క్షతగాత్రుడిని బయటకు తీశారు.

**రోదిస్తున్న రామాంజనేయులు కుటుంబ సభ్యులు:** ఆధారం కోల్పోయి.. షేక్ మీరావలి అందరితో కలివిడిగా ఉంటారు. తమకున్న అయిదెకరాలు భూమిని సాగు చేసుకుంటూ పెద్ద కుమారుడిని విదేశాలకు పంపించారు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్న కుమారుడు పని చేయలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. కుటుంబానికి మీరావలియే ఆధారం. భర్త ఆకస్మిక మరణంతో ఆధారం కోల్పోయామంటూ భార్య శీనాబీ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

**దేవుడా.. ఇల్లు గడిచేదెలా:** ముప్పాళ్ల మండలం మాదల బీసీ కాలనీకి చెందిన మొగతపురపు శ్రీను అలియాస్ శ్రీనివాసరావు భార్య రాధ దివ్యాంగురాలు. వీరికి నలుగురు కుమార్తెలు. శ్రీను కార్లకు హాల్టింగ్ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. నరసరావుపేటకు వలస వెళ్లాడు. అక్కడే నివాసముంటూ కారు డ్రైవింగ్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల పెద్ద కుమార్తె పెళ్లి కాగా.. ఇద్దరు ఇంజినీరింగ్, ఒకరు ఇంటర్ చదువుతున్నారు. మాదలలో ఉంటున్న తల్లిదండ్రులు వెంకయ్య, నాగేంద్రమ్మలను కూడా శ్రీనునే చూసుకుంటున్నాడు. విశాఖకు వెళ్లి వస్తానని రాత్రి ఇంటి నుంచి వెళ్లి.. విగతజీవిగా మారాడని తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ముగ్గురు ఆడపిల్లలు, అత్తామామలను ఎలా పోషించాలి, ఇల్లు గడిచేదెలా స్వామీ అంటూ భార్య విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

**కుటుంబానికి దిక్కెవరు:** పాలగాని రామాంజనేయులుకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు నరసింహారావుకు ఆరోగ్యం సరిగా లేక ఇంటి వద్దే ఉంటున్నాడు. కుమార్తె మహాలక్ష్మికి పెళ్లి చేశారు. పెద్ద కుమారుడితోపాటు తల్లి కోటిరత్తమ్మ, భార్య ఆదిలక్ష్మి, చిన్నకుమారుడు హరీష్‌లు ఆయనే దిక్కు. వ్యవసాయం చేసుకునే రామాంజనేయులు ప్రమాదానికి గంట ముందు కూడా పక్క పొలం రైతుకు ఫోన్ చేసి శుభకార్యం నుంచి వచ్చిన తర్వాత పత్తి పైరుకు నీళ్లు పెడతానని చెప్పారు. ఇంతలో తిరిగి రాని లోకాలకు వెళ్లారు. కుటుంబానికి దిక్కెవరంటూ భార్య ఆదిలక్ష్మి గుండెలవిసేలా విలపిస్తోంది. శనివారం రాత్రి ఫోన్లో మాట్లాడి ఇంతలో దూరమయ్యావా అంటూ పెద్దకుమారుడు నరసింహారావు కన్నీటిపర్యంతం అయ్యారు.

**నాన్నతో వెళ్లి తిరిగిరాని లోకాలకు :** మందపాటి చంద్రశేఖర్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె. చిన్నకుమారుడు మందపాటి భవానీ శంకర్ ముప్పాళ్లలో ఆరో తరగతి చదువుతున్నాడు. చదువులో ముందుండేవాడు. శనివారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. తండ్రి శుభకార్యానికి వెళుతుంటే ఆదివారం సెలవుకావడంతో తనూ వస్తానంటూ వెళ్లాడు. ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. కుమారుడి మరణం గురించి తెలియని తండ్రి చంద్రశేఖర్ భవానీ శంకర్ ఎక్కడని అడగడం అందరినీ కలచివేసింది.

# నేడు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 202 మంది విద్యార్థులకు సోమవారం షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కు సంబంధించి 168 మంది, జూనియర్ కళాశాలలకు సంబంధించి 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో ఓసీ 58 మంది, బీసీ 60 మంది, ఎస్సీ 32 మంది, ఎస్టీ 18 మంది ఉన్నారని, ఇంటర్‌లో ఓసీ, బీసీ, ఎస్సీల కు సంబంధించి ఏడుగురు చొప్పున, ఎస్టీ నలుగురు, సీడబ్ల్యూఎస్ఎన్ 3, మైనార్టీ--6 సంబంధించి ఆరుగురు ఉన్నారని తెలిపారు. అత్యధికంగా చిత్తూరు అర్బన్ మండలం నుంచి పదో తరగతి లో 9 మంది, ఇంటర్‌లో 14 మంది ఎంపిక కాగా తర్వాత పూతపట్టు మండలం నుంచి పదో తర గతి 8 మంది, గంగవరం మండలం నుంచి ఇంటర్‌లో ఎనిమిది ఉన్నారని తెలిపారు. షైనింగ్‌స్టార్స్ అవార్డు కింద రూ.20 వేల చెక్కు, ప్రశంసా పత్రం అందజేస్తామని వెల్లడించారు. విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రితో కలిసి ఎంఈఓ--2 కార్యక్రమానికి హాజరుకావాలని వివరించారు.

# క్విజ్‌పోటీల్లో డాక్టర్ కృష్ణప్రియ ప్రతిభ

## జాతీయ స్థాయిలో రెండోస్థానం కైవసం

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజ్, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ పోలవరపు కృష్ణప్రియ క్విజ్ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. న్యూఢిల్లీలో శనివారం ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏపీ తరపున గుంటూరు మెడికల్ కాలేజ్ నుంచి పాల్గొన్న డాక్టర్ కృష్ణప్రియ జాతీయస్థాయిలో రెండోస్థానంలో నిలిచారు. ఇటీవల ఏపీలో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో స్టేట్ ఫస్ట్ సాధించిన డాక్టర్ కృష్ణప్రియ జాతీయ స్థాయిలో చేరుకున్నారు. ఆదివారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. గాజుల రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అజ్మ, పలువురు పీజీ వైద్య విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు. డాక్టర్ గాజుల రామకృష్ణ 2014లో జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి రికార్డు సృష్టించగా.. నేడు గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీకి చెందిన డాక్టర్ కృష్ణప్రియ రెండో స్థానంలో నిలిచారు. తద్వారా గుంటూరు వైద్య కళాశాల పేరు మరోమారు జాతీయస్థాయిలో మారుమోగేలా చేశారు.

# మహంకాళికి నిమ్మకాయల అలంకరణ

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయల దండలతో అలంకరించారు. భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించి, మొక్కులు తీర్చుకున్నారు. అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

# వైభవంగా యాదవ సంఘం మహాసభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం అఖిల భారత యాదవ మహా సంఘం చిత్తూరు జిల్లా ప్రథమ మహాసభలు వైభవంగా నిర్వహించారు. పి.నవీన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు జాతీ య అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్‌తో పాటు దాదాపు 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడిగా పి.నవీన్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆవుల గోపీయాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రాణి యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి మొదట దర్శించుకున్న శరభయ్య యాదవ్ విగ్రహాన్ని తిరుమలలో ప్రతిష్టించడంతో పాటు ఆయన పేరుతో మఠాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. యాదవ కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని, దేశంలో కులగణన చేపట్టి చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యాదవులపై జరుగుతున్న దాడుల నివారణకు బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని కోరారు.

# వ్యాధుల కాలం.. జర భద్రం

## గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు అవశ్యం

మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం.. వానలు కురుస్తుండటంతో ఎక్కడికక్కడ నీరు నిలిచి పల్లెల్లో దోమల ఉద్ధృతి పెరుగుతోంది. అధ్వాన పైపులైన్ల కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు నిధుల కొరత ఉంది. విష జ్వరాలు, డెంగీ జ్వరాలు విజృంభించక ముందే పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులు మేల్కొని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో నగరం, చెరుకుపల్లి, రేపల్లె, వేటపాలెం మండలాల్లో డెంగీ జ్వరాలు ప్రబలి వందల మంది ఆసుపత్రుల్లో చేరారు. మరణాలు సంభవించాయి. పరిస్థితి చేయి దాటిపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర బృందాలు జిల్లాలో పర్యటించి నివారణ చర్యలు చేపట్టాయి. మురుగు నిల్వ ఉండటంతో దోమల ఉద్ధృతి పెరిగి ప్రజలు కాటుకు గురి కావడం వల్లే డెంగీ జ్వరాల బారినపడినట్లు విచారణలో తేలింది. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 18 డెంగీ జ్వరాల కేసులు నమోదయ్యాయి. బాపట్ల మండలం తూర్పుబాపట్ల పంచాయతీ పరిధిలోని హైదర్‌పేటలో ఇటీవల ఎనిమిదేళ్ల బాలుడు స్క్రబ్ టైఫస్ బారిన పడ్డాడు.

**పర్యవేక్షణ పెరగాలి..** పంచాయతీ సర్పంచుల పదవీకాలం గత ఏప్రిల్ 4న ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు రోజులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాల్సి ఉంది. ప్రభుత్వం సున్నం, బ్లీచింగ్ కొనుగోలు, దోమల మందుల పిచికారీకి నిధులు విడుదల చేయాలి. పంచాయతీల నిధుల వినియోగంపై ఫ్రీజింగ్‌ను కొంతమేరైనా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఎత్తివేయాలి.

**నీరు నిల్వ ఉండకుండా చూడాలి..** కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణ మందులు చల్లించాలి. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపించాలి. చెత్త, వ్యర్థాలు నివాస ప్రాంతాల్లో కుప్పలుగా వేయకుండా చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లను తొలగించాలి. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేసి లార్వాలను ధ్వంసం చేయాలి.

**రాల సర్వే పక్కాగా చేపట్టాలి..** వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇంటింటా జ్వరాల సర్వేను పక్కాగా నిర్వహించాలి. జ్వర పీడితుల్ని గుర్తించి సత్వరమే ఆసుపత్రుల్లో రక్త పరీక్షలు చేయించాలి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాల్ని ఆరంభంలోనే గుర్తించి వైద్యులతో మెరుగైన వైద్యం అందించాలి. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు గ్రామాల్లో రక్షిత నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలి. క్లోరినేషన్ జరిగేలా పర్యవేక్షించాలి. పాత పైపులైన్ల లీకులకు మరమ్మతులు చేయాలి. డీఎంహెచ్‌వో విజయమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో జ్వరాల కేసులు పెద్దగా లేవని తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టామన్నారు. రక్త పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాలు అందించామని తెలిపారు. ర్యాపిడ్ పరీక్షల కిట్లు అందజేసినట్లు వివరించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

# పొలం పిలుస్తోంది

### వారంలో రెండ్రోజులు.. రోజుకు రెండు గ్రామాలు

### ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుపై అవగాహన

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎల్‌నినో నేపథ్యంలో బిందు, తుంపర విధానంలో సేద్యం ప్రకృతి వ్యవసాయం బాట పట్టాలని వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు రైతులకు సూచిస్తున్నారు. సాగులో ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడులు ఎలా సాధించాలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు కర్షకుల చెంతకు వెళ్లి అవగాహన కల్పించనున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ఈ నెల 14వ తేదీ నుంచి మొదలైంది. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున కార్యక్రమం నిర్వహిస్తారు. తొలి రెండ్రోజులు వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతిసేద్య విభాగం అధికారులు, డాట్ కేంద్రం శాస్త్రవేత్తలు పొలం బాట పట్టారు. ఉదయం క్షేత్ర పర్యటన చేసి సాగులో ఉన్న పంటల స్థితిగతులను పరిశీలించి అనంతరం సమావేశం ఏర్పాటుచేశారు. పంటల సాగులో మెలకువలు వివరించారు.

**రాయితీలు, ఇతర ప్రయోజనాలు :** రైతుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న రాయితీ పథకాలు, బీమా, ఇతర ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల సద్వినియోగం ఎలాగో చెబుతారు. విశిష్ఠ సంఖ్య, ఈకేవైసీ పూర్తి చేసుకోని వారుంటే వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేస్తారు. యాప్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల అమ్మకాలపై అవగాహన కల్పిస్తారు. ఇప్పటివరకు సాగు వివరాలు నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు ఆశాజనకంగా లేదు. వర్షాలు కురవగానే ఎలాంటి పంటలు సాగు చేస్తే మంచిదో పొలం పిలుస్తోందితో అన్నదాతలకు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేస్తామని జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మి తెలిపారు.

# దుష్ట పాలనపై 'వినతి పాదయాత్ర'

### 31న గుంటూరు నుంచి మంగళగిరి డీజీపీ ఆఫీస్ వరకు అంబటి నడక

### ఇల్లు, ఆఫీసుపై దాడి చేసిన ఒక్కరినీ అరెస్ట్ చేయలేదని ఆవేదన

### గుంటూరులో మహిళపై అమానుష దాడి ఘోరమని వ్యాఖ్య



నెహ్రూనగర్: రాష్ట్రంలో కూటమి దుష్టపాలన సాగుతోందని, దానిపై రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ దుశ్చర్యలను నిరసిస్తూ ఈ నెల 31, ఆగస్ట ఒకటో తేదీలలో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరి డీజీపీ కార్యాలయం వరకు 29 కిలోమీటర్ల మేర 'వినతి పాదయాత్ర' చేపట్టనున్నట్లు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహణపై ముందస్తు ప్రణాళితోపాటు, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా రూపొందించిన జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం బస్టాండ్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ... జనవరి 31న గుంటూరులో తన ఇల్లు, కార్యాలయంపై టీడీపీ శ్రేణులు పెట్రోల్ బాంబులు, రాళ్లతో గంటలపాటు దాడి చేసి అరాచకం సృష్టించాయని గుర్తుచేశారు. పోలీసులు అక్కడే ఉన్నా దాడిని ఆపలేదని, టీవీల్లో నిందితుల ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నా ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. తనను మాత్రం అక్రమంగా 18 రోజులు జైల్లో పెట్టారని, ఈ అధర్మానికి అడ్డుకట్ట వేయడానికే తాము శాంతియుతంగా డీజీపీకి వినతిపత్రం ఇచ్చేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.

**టీడీపీ నేతల కోసం రాజీలా :** గుంటూరులో ఇటీవల ఒక మహిళపై జరిగిన అమానుష దాడిపై అంబటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు 15న మధ్యాహ్నమే స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేసినా, నిందితుడు టీడీపీ నేత కావడం వల్లే స్థానిక మహిళా ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చి సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయ్యాకే చంద్రబాబు నాటకీయంగా సీరియస్ అయ్యారని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు ఐదేళ్లకు ఒకసారి మారతాయని, పోలీసులు తమ సర్వీసులపై మచ్చ తెచ్చుకోవద్దని అంబటి హితవు పలికారు. అధికార పార్టీ నేతల చుట్టూ తిరిగి బలి పశువులు కావొద్దని, చట్టప్రకారం పనిచేయాలని హెచ్చరించారు. పాదయాత్ర కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**అందరూ తరలిరండి:** పాదయాత్రను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మహిళలకు రాష్ట్రంలో భద్రత లేకుండా పోయిందని ఆగ్రహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఉదయం నుంచి రాత్రి వరకూ సారె సమర్పణలు

### అన్ని టికెట్ల విక్రయాలు రద్దు..

గతంలో శుక్రవారం, ఆదివారాల్లో కేవలం అంతరాలయ దర్శనాలను మాత్రమే రద్దు చేసేవారు. అయితే ఆదివారం భారీగా భక్తులు తరలిరావడంతో అన్ని టికెట్ల విక్రయాలను రద్దు చేసి ఉచితంగా ఆయా క్యూలైన్ మార్గాల్లో భక్తులను దర్శనానికి అనుమతించారు. ముందుగా ఆన్‌లైన్‌లో రూ. 500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. వారికి మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించారు.

## ప్రతిభ ఆషాఢ వైభవం.. 'ఇంద్ర'వైభోగం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో ఆదివారం రికార్డు స్థాయిలో భక్త బృందాలు సారెను సమర్పించాయి. జగన్మాత దుర్గమ్మను భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావించి పసుపు, కుంకుమ, పూజా సామగ్రి, చీర, మిఠాయిలను సమర్పించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, తిరిగి సాయంత్రం ఆరున్నర నుంచి రాత్రి 9.30 గంటల వరకు సారె సమర్పణలు కొనసాగాయి. దీంతో ఉదయాస్తమాన సేవగా సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుందా అనే భావన భక్తుల్లో కలిగింది. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

# నియామక తేదీ ఆధారంగానే సీనియార్టీ జాబితాలు రూపొందించాలి : ఎస్టీయూ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల ఉద్యోగ నియామక తేదీ ఆధారంగానే సీనియార్టీ జాబితాలు రూపొందించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉగ్గం మహంకాళరావు, జె.శంకర వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త జిల్లాల వారీగా చేపడుతున్న ఉపాధ్యాయుల కేటాయింపులో భాగంగా రూపొందిస్తున్న జిల్లా సీనియారిటీ జాబితాల్లో ఉపాధ్యాయులందరికీ పూర్తి న్యాయం జరగాలని, వారి అసలు నియామక తేదీని ప్రామాణికంగా తీసుకుని సీనియారిటీని కల్పించాలన్నారు. సుదీర్ఘకాలంగా ప్రభుత్వ సేవలో ఉంటూ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుల హక్కులను కాలరాసే విధంగా సీనియారిటీ జాబితాల రూపకల్పన ఉండకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా కింది వర్గాల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జిల్లా పునర్విభజన అనేది కేవలం ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన ప్రక్రియ అని, దీని ప్రభావంతో దశాబ్దాలుగా ప్రభుత్వ సేవలో ఉన్న ఉపాధ్యాయులు తమ సీనియారిటీని కోల్పోయే పరిస్థితి రావడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరిగినా ఎస్టీయూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యాశాఖ, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉపాధ్యాయుల అసలు నియామక తేదీ ప్రకారమే తుది సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసి, ఉపాధ్యాయ లోకానికి నమ్మకం కలిగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు కొరివి విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో సుబ్రహ్మణ్యస్వామి కావడి మహోత్సవం

బాపట్ల: ఆషాఢ మాసంలో అత్యంత ప్రీతికరమైన ఆషాఢ శుద్ధ పంచమి (స్కంద పంచమి) పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలో సుబ్రహ్మణ్యస్వామి వారి లలితా త్రిపుర సుందరి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం (స్కంద షష్టి) రోజున విశేష పూజలు, సర్పసూక్త హోమం అత్యంత వైభవం నిర్వహించారు. నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు మాట్లాడుతూ ఉదయం కావడి ద్రవ్యాలతో సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష అభిషేక కార్యక్రమం, అనంతరం హస్త, కృత్తిక, విశాఖ, ఆశ్లేష నక్షత్రాల జాతకుల కోసం, శని, రాహు, కేతు గ్రహ జపాలు జరిగాయి. సుబ్రహ్మణ్యస్వామి వారి మూల మంత్రంతో సర్పసూక్త మహా మంత్ర దివ్య హోమంతోపాటు లక్ష్మీ గణపతి, రుద్ర, మృత్యుంజయ మంత్రాలతో విశేష హోమ క్రతువులు జరిగాయి. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన అఖండ పుష్పార్చన కార్యక్రమంతోపాటు సుబ్రహ్మణ్య స్వామి స్వరూపులైన వేద విద్యార్థులకు, చిన్న పిల్లలకు బ్రహ్మచారుల పూజా కార్యక్రమంలో భక్తులు వేద విద్యార్థులను పూజించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులందరికీ స్వామి వారి అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో బాపట్ల పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, శ్రీనివాసుల విఖనస మూర్తి, పరాశరం రఘురామ్, కౌండిన్య, సాయి వెంకట్ పాల్గొన్నారు.

# డేటాతో కుస్తీ పట్టి..!

### పూతలపట్టు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినుల అవస్థ

### పిల్లలతో డేటా ఎంట్రీ చేయిస్తున్న ఉపాధ్యాయులు

### సిబ్బంది కొరత పేరుతో కుంటి సాకులు

### మండిపడుతున్న తల్లిదండ్రులు

పూతలపట్టు (యాదమరి) : పాఠశాలకు వెళ్లి బుద్ధి గా చదువుకోవాల్సిన విద్యార్థినులు.. అక్కడ ఉపాధ్యాయులు చేయాల్సిన పనులను తమ భుజాలపై వేసుకున్న ఘటన పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెలుగుచూసింది. గురువులు నిర్వర్తించాల్సిన రికార్డుల నమోదు ప్రక్రియను విద్యార్థినులే స్వయంగా సెల్ ఫోన్ల ముందు కూర్చు ని చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా మిత్ర కిట్లు అంటే పాఠ్యపుస్తకాలు, షూలు, యూనిఫామ్ వివరాలను బయోమెట్రిక్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో నమో దు చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులే దగ్గరుండి ఎస్ఆర్‌కే వీఏం యాప్‌లో ఈ వివరాలను పూర్తి చేయాలి. పాఠశాలలో మొత్తం 419 మంది విద్యార్థులుండగా, ఇంటర్నెట్ బాగుంటే ఒక్కో విద్యార్థి వివరాల నమోదుకు కనీసం ఒక నిమిషం సమయం పడుతుందని, లేదంటే కుస్తీ పడాల్సిందేనని అధికారులు చెబుతున్నారు.

**సీన్ రివర్స్:** అయితే, పూతలపట్టు జెడ్పీ హైస్కూల్‌లో మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. తరగతి గదుల్లో పాఠాలు వినాల్సిన విద్యార్థినులను తీసుకువచ్చి ఈ డేటా ఎంట్రీ పనుల్లో కూర్చోబెట్టారు. అంతటితో ఆగకుండా, ఆ విద్యార్థినులు పని చేస్తున్న సమయంలో వారిని పర్యవేక్షించేందుకు కనీసం ఒక్క ఉపాధ్యాయుడు కూడా అక్కడ లేకపోవడం గమనార్హం.

**చర్యలకు డిమాండ్ :** పిల్లలు చదువుకునేందుకు పాఠశాలకు పంపితే ఇలాంటి ఆఫీసు పనులు చేయిస్తారా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆనన్‌లైన్ నమోదులో ఏదైనా తప్పులు దొర్లి స్తే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు తమ విధులను పక్కనపెట్టేశారు. విద్యామిత్ర కిట్లవివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యతను విద్యార్థినుల భుజానికెత్తేశారు. చక్కగా చదువుకోవాల్సిన వారి చేతిలో సెల్‌ఫోన్ పెట్టి డేటా ఎంట్రీ చేయిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే సిబ్బంది కొరతంటూ కుంటి సాకులు చెబుతున్నారు. టీచర్ల వ్యవహారశైలిపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పిస్తారని పంపిస్తే గుమస్తా పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వింత సమర్థన :** దీనిపై పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను వివరణ కోరగా వారు వింత సమాధానం ఇచ్చారు. పాఠశాలలో సిబ్బంది కొరత వేధిస్తోందని, అందుకే విద్యార్థుల సహాయంతో ఈ వివరాలను ఆన్?లైన్ చేస్తున్నామంటూ సమర్థించుకు నే ప్రయత్నం చేశారు. కానీ,పాఠశాల రికార్డుల ప్రకా రం ఇక్కడ ఏకంగా 18 మంది ఉపాధ్యాయులు విధు లు నిర్వర్తిస్తున్నారు. ఇంతమంది ఉండి కూడా, కేవలం డేటాఎంట్రీ పనుల కోసం విద్యార్థుల చదువును పణంగా పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పోక్సో కేసులో యువకుడి అరెస్టు

బంగారుపాళెం : బాలికను లైగింక వేధింపులకు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాగిమానుపెంట దళితవాడకు చెందిన ఆనంద్ శుక్రవారం రాత్రి పెద్దవంక గ్రామానికి చెందిన బాలికను లైంగికగా వేధించాడని తెలిపారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఆనంద్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

గంగవరం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని గండ్రాజుపల్లి వద్ద ఓ దుకాణంలో గంజాయి విక్రయిన్నట్టు సమాచారం రావడంతో ఆదివారం దాడి చేసినట్టు తెలి పారు. ఈ క్రమంలో గండ్రాజుపల్లి పంచాయతీ బండిండ్లు గ్రామానికి చెందిన బాబు, బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన రఫీఖాన్ ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

## ఏఈఈ పోస్టుల దరఖాస్తులకు నేడే ఆఖరు

### –గస్ట్ 22 నుంచి 29 వరకు రాత పరీక్షలు

తిరుపతి రూరల్ : ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల దరఖాస్తులకు సోమవారం గడువు ముగుస్తుందని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్ట్ 22 నుంచి 29వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్న ట్లు వెల్లడించారు. ఈ షెడ్యూల్ తేదీల్లో మార్పు ఉండదని స్పష్టం చేశారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందన్నారు. వివరాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నా రు. దళారుల మాటలు, సామాజిక మాధ్యమాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మవద్దన్నారు.

## నేడు 'డయల్ యువర్ సీఎండీ'

తిరుపతి రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ నిర్వహించనున్నట్లు ఎస్పీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూ రు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావచ్చని వివరించారు.

## 'నీట్'గా 658వ ర్యాంక్

చిత్తూరు కలెక్టరేట్ : నీట్-- 2026 ఫలితాలలో చిత్తూరుకు చెందిన పెరికెటి అనురాగ్ అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా స్థాయిలో 658 వ ర్యాంక్ సాధించారు. చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన పి.రాజేంద్ర ప్రసాద్, మమతరాణి దంపతుల కుమారుడైన అనురాగ్ సాధించిన ర్యాంకుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 720 మార్కులకు గాను 666 మార్కులు సాధించడంపై అభినందనలు తెలియజేశారు. అనురాగ్ తొలి నుంచీ చదువులో ఉత్తమంగానే రాణించారు. మదనపల్లె శ్రీ చైతన్య పాఠశాలలో పదో తరగతి చదివి 600 మార్కుల కు 579 మార్కులు సాధించారు. విజయవాడ గోశాలలోని శ్రీ చైతన్య జూని యర్ కళాశాలలో ఇంటర్‌లో 976 మార్కులు పొందారు. తెలంగాణ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 56వ ర్యాంక్ కై వసం చేసుకోవడం విశేషం.

# విజయ్ సరికొత్త నిర్ణయాలు.. ఆకస్మిక తనిఖీలు.. పాలనలో సంస్కరణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సరికొత్త నిర్ణయాలతో ప్రజల మనసులను కొల్లగొడుతున్నారు. తొలిసారి ముఖ్యమంత్రిగా ఎంపికయ్యానన్న ఆలోచన ఆయనలో కనిపించడం లేదు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్న నేతగా వ్యవహరిస్తున్నారు. అనేక సంస్కరణలు, నిర్ణయాలు, ఆకస్మిక తనిఖీలతో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు విజయ్ ప్రయత్నిస్తున్నారు. చాలా వరకూ ఈ మూడు నెలల కాలంలోనే సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ప్రధానంగా అవినీతి రూపుమాపడానికి, ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరు మెరుగుపర్చడానికి విజయ్ చేస్తున్న ప్రయత్నాలు ప్రజల్లోకి వెళుతున్నాయి.

**ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు...**

ప్రభుత్వ పాలనలో అవినీతిని రూపుమాపడానికి, సేవలను మెరుగుపరచడానికి 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తూ పలు ఆకస్మిక తనిఖీలు మరియు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. చెన్నైలోని ఎగ్మోర్ ప్రభుత్వ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ లో సీఎం విజయ్ ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రత, చిన్న పిల్లల వార్డుల నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు మెరుగైన వైద్యం, పరిశుభ్రత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చెన్నైలోని సోషల్ జస్టిస్ హాస్టల్‌ను




కూడా ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల లేమి, సిబ్బంది ప్రవర్తనపై ఆరా తీశారు.

**సంచలనాత్మక నిర్ణయాలు...**

చెన్నై కార్పొరేషన్ లో జరిగిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ నివేదిక ఆధారంగా, రూ. 2.39 లక్షల వరకు సరైన లెక్కలు చూపని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో సహా మొత్తం ఏడుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ చర్యలకు ఆదేశించారు. సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం విజయ్ మంత్రులు, ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాఖల్లో అవినీతి జరిగితే మంత్రులను సైతం తొలగిస్తానని, క్లీన్ అండ్ పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమని తేల్చిచెప్పారు.

**రీల్స్ కల్చర్ పై నిషేధం...**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మంత్రులు, అధికారులు సోషల్ మీడియా రీల్స్ చేయడంపై నిషేధం విధించారు. అధికారిక విధుల్లో ఉన్నప్పుడు ఫోటోలు, వీడియోలకు పరిమితం కాకుండా పరిపాలనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.ప్రరాష్ట్రంలో అవినీతిని అరికట్టడానికి ప్రజలు నేరుగా లంచాల గురించి ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక వాట్సాప్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. రైతులను ఆదుకునేందుకు కూడా తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల వద్ద నుంచి బలవంతంగా రుణాల వసూలుకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇలా విజయ్ అన్ని వర్గాల ప్రజల మనసును దోచుకుంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డబ్బుతో పాటు స్వేచ్ఛ.. సాఫ్ట్‌వేర్ గూడు దాటి.. రెక్కలు విప్పిన ఒక యువకుడి స్ఫూర్తిదాయక ప్రయాణం

**హైదరాబాద్ పెన్ పవర్:** రెక్కలు తెంచుకుని ఆకాశంలో ఎగరాలనే పక్షిని తెచ్చి.. బంగారు పంజరంలో పెడితే దానికి సంతోషం ఉంటుందా? ఐటీ ఉద్యోగం కూడా నేటి యువతకు అలాంటి ఒక ఆధునిక పంజరమే అయిపోతోంది. సమాజం దృష్టిలో ఐటీ అంటే పెద్ద జీతం, ఏసీ రూము, చేతిలో లాప్‌టాప్, కార్పొరేట్ హోదా. కానీ ఆ ఏసీ గదుల వెనుక దాగున్న ఒత్తిడి, నిద్రలేని రాత్రులు, మేనేజర్ల డెడ్‌లైన్ల వేధింపులు కేవలం ఆ సీట్లలో కూర్చునే వారికే తెలుసు. సరిగ్గా ఇలాంటి ఐటీ బానిసత్వం నుంచి బయటపడి తన జీవితానికి తానే యజమానిగా మారిన ఒక యువకుడి కథ ఇప్పుడు ప్రతి ఒక్కరి గుండెను తాకుతోంది. నెలకు రూ. 40 వేల స్థిరమైన జీతం వచ్చే ఐటీ ఉద్యోగం.. ఎంతోమంది కలలుగనే కెరీర్ అది. కానీ ఆ యువకుడికి ఆ జీతం భద్రతను ఇచ్చిందే తప్ప ప్రశాంతతను ఇవ్వలేదు. గడియారం ముల్లుతో పరిగెత్తే జీవితం, కంప్యూటర్ స్క్రీన్ ముందు కరిగిపోతున్న సమయం, వీకెండ్‌లో కూడా వదలని ఆఫీస్ మెయిల్స్.. ఇవన్నీ అతడి మానసిక స్వేచ్ఛను హరించేశాయి. నెల చివర్లో బ్యాంక్ అకౌంట్‌లో పడే డబ్బు కంటే, ప్రతిరోజూ అనుభవించే మనశ్శాంతే మిన్న అని అతడు గ్రహించాడు. అందుకే ధైర్యంగా ఆ 'కార్పొరేట్ ముసుగు'ను విసిరేసి, చేతిలోకి క్యాబ్ స్టీరింగ్‌ను తీసుకున్నాడు.

**ఒత్తిడి లేని పయనం.. రెట్టింపు ఆదాయం**

క్యాబ్ డ్రైవర్‌గా మారడం అంటే చాలామంది దృష్టిలో స్థాయి తగ్గడమే కావచ్చు. కానీ అతడి దృష్టిలో అది స్వేచ్ఛా విహారం. నేడు అతడు రోజుకు ఎన్ని గంటలు పని చేయాలి.. ఎప్పుడు విశ్రాంతి తీసుకోవాలో తనే నిర్ణయించుకుంటున్నాడు. ఆఫీస్ మేనేజర్ల గుసగుసలు లేవు.. లేఆఫ్‌ల భయాలు అసలే లేవు. అన్నిటికీ మించి, ఐటీ ఉద్యోగంలో వచ్చిన రూ. 40 వేల ఆదాయం కాస్తా ఇప్పుడు అతడి కష్టానికి ప్రతిఫలంగా రూ. 80 వేలుగా మారింది. "కారు ఇంధనం, మెయింటెనెన్స్ ఖర్చులు పోను కూడా నా చేతిలో ఐటీ ఉద్యోగం కంటే ఎక్కువే మిగులుతోంది. కానీ అన్నిటికంటే ముఖ్యమైనది.. ఈరోజు నా కుటుంబంతో గడపడానికి నా దగ్గర సమయం ఉంది. మనసులో ప్రశాంతత ఉంది" అని ఆ యువకుడు గర్వంగా చెబుతున్నాడు.

**మనసుకు నచ్చిన బాటలోనే విజయం**

ఈ కథ కేవలం ఒక ఉద్యోగం మార్పు గురించి మాత్రమే కాదు.. సమాజం గీసిన గీతలను దాటి, మనసుకు నచ్చిన దారిలో నడిచే ధైర్యం గురించి... జీవితంలో డబ్బు అవసరమే, కానీ ఆ డబ్బు కోసం మన సంతోషాన్ని, ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదని ఈ ఉదంతం నిరూపిస్తోంది. కష్టపడి సంపాదించే ఏ వృత్తీ తక్కువ కాదు. సమాజపు హోదాల కంటే మన సంతృప్తే ముఖ్యం. కార్పొరేట్ కంపెనీలలో ఎంత కష్టపడినా గుర్తింపు రాని చోట.. ఇక్కడ మన సొంత కష్టానికి పూర్తి లాభం మనకే దక్కుతుంది.

సోషల్ మీడియాలో దీనిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి. కొంతమంది భవిష్యత్తు భద్రత గురించి మాట్లాడుతుంటే, మరికొందరు మాత్రం అతడి ధైర్యాన్ని అభినందిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ క్యాబ్ డ్రైవింగ్ సరిపోకపోవచ్చు.. కానీ ఈ కథ ఇచ్చే సందేశం ఒక్కటే "జీవితం నీది.. నిర్ణయం నీది". సమాజం కోసం కాకుండా మీ మనసుకు ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చే రంగంలో అడుగుపెట్టినప్పుడే అసలైన విజయం సొంతమవుతుంది. ఆ యువకుడి ప్రయాణం.. ఒత్తిడితో నలిగిపోతున్న ఎంతోమంది యువతకు ఒక కొత్త ఆలోచనను, స్ఫూర్తిని రగిలిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## చంద్రబాబు వద్ద జాబితా రెడీ.. లోకల్ వార్ తర్వాత స్పేర్ చేయరట

**హైదరాబాద్ పెన్ పవర్:** చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. జాబితాను సిద్ధం చేశారు. టీడీపీలో ప్రక్షాళనకు చంద్రబాబు సిద్ధమయినట్లు సమాచారం. త్వరలోనే పూర్తి స్థాయిలో ప్రక్షాళనకు చంద్రబాబు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఈ




ప్రక్షాళన జరుగుతుందా? లేక ఇప్పుడే చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది. అయితే ఎన్నికలకు ముందు నేతలపై చర్యలు తీసుకుంటే ఆ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందని కొంత ఆలోచనలో టీడీపీ అధినేత ఉన్నారు. అయితే ఆలస్యం చేస్తే మరింత రాజకీయంగా పార్టీకి నష్టం చేకూరుతుందన్న అనుమానం కూడా అధినేతలో ఉంది. దీనిపై సీనియర్ నేతలతో చర్చించిన తర్వాత చర్యలకు సిద్ధమవుతారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. Also Read - YSRCP : స్పీకర్ తమ్మినేని కుటుంబ సభ్యులపై కేసు నమోదు కొంతమంది నేతలపై... నియోజకవర్గాల్లోని కొంతమంది నేతలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని సర్వేలు పదే పదే వెల్లడిస్తున్నాయి. అయినా వారిలో మార్పు రాలేదు. దాని వల్ల ఎమ్మెల్యేతో పాటు పార్టీకి కూడా నియోజకవర్గంలో తీవ్ర నష్టం జరుగుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే అనేక సార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ చాలా మందిలో మార్పు రాలేదు. అసలు చంద్రబాబు మాటను పట్టించుకోవడం లేదు. ప్రతి పనికీ పర్సంటేజీలు, కమీషన్లు, వైసీపీ నేతలతో వ్యాపారాలు బహిరంగంగానే చేయడంపైన కూడా ఎప్పటికప్పుడు నివేదికలు చంద్రబాబుకు అందుతున్నాయి. కానీ వేటు వేసే సమయం కోసం చంద్రబాబు ఎదురు చూస్తున్నారు. Also Read - Ys Jagan : వచ్చే ఎన్నికలకు జగన్ యుద్ధరీతిని మార్చారా? ఆలోచించి .. ఆలస్యంగానైనా... చంద్రబాబు ఏ నిర్ణయమైనా ఆలోచించి.. ఆలస్యంగానైనా పార్టీకి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటారన్న పేరుంది. ప్రజా వ్యతిరేకత ఉన్న నేతలను వదులుకోవడానికీ వెనుకాడబోమని సీఎం చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే జరుగుతుండటంతో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకునేందుకు తన చర్యలు నష్టం కలిగించకూడదన్న ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే వేటు పడే వారి జాబితా చంద్రబాబు వద్ద సిద్ధంగా ఉందని అంటున్నారు. అయితే లోకల్ వార్ పూర్తయిన తర్వాత మాత్రం ఇక ఉపేక్షించకూడదని చంద్రబాబు భావించారు. అంతకంటే ముందుగా చంద్రబాబు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు త్వరలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్ షాప్ లో మరోసారి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

# పేద లుక్ బెటర్.. బెంగళూరు టెక్కీ వైరల్ పోస్ట్.. ఆ 'టాక్స్' ఏంటో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధునిక సమాజంలో ఒకప్పుడు సంపద అనేది దాచుకునే వస్తువు.. కానీ నేటి డిజిటల్ యుగంలో అది ఒక 'ప్రదర్శన' వస్తువుగా మారిపోయింది. చేతిలో ఐఫోన్, వేల రూపాయల బ్రాండెడ్ బట్టలు, ఖరీదైన కార్లు ఉంటేనే సమాజంలో ఒక హోదా దక్కుతుందనే భ్రమలో మెజారిటీ ప్రజలు బతుకుతున్నారు. అయితే ఇలా 'ధనవంతుడిలా కనిపించడం' వల్ల సమాజం మన నుంచి ఎంత దోచుకుంటుందో తెలుసా? సరిగ్గా ఇదే పాయింట్‌ను టచ్ చేస్తూ బెంగళూరుకు చెందిన మీనాంక్ మిన్ను అనే ప్రొఫెషనల్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ లింక్డ్‌ఇన్‌లో పెట్టిన పోస్టు ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. డబ్బు ఉన్నప్పటికీ తాను ఉద్దేశపూర్వకంగానే "పేదవాడిలా" కనిపించేందుకు ప్రయత్నిస్తానని ఆయన చెప్పిన మాటలు నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీశాయి.

**'లుక్స్ రిచ్ ట్యాక్స్' .. అసలేంటి కథ?**

ఖరీదైన వస్తువులు వాడటం, విలాసవంతంగా కనిపించడం వల్ల మనకు తెలియకుండానే ఒక అదనపు ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తుందని మీనాంక్ అభిప్రాయపడ్డారు. దీనిని ఆయన 'లుక్స్ రిచ్ ట్యాక్స్' అని పిలిచారు. సమాజంలో మనం ధనవంతుల్లా కనిపిస్తే ప్రజలు, వ్యాపారులు, సేవలు అందించే వారు మన దగ్గర అదనపు ధరలు వసూలు చేస్తారని ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. "మీరు ధనవంతులా కనిపిస్తే మార్కెట్లో బంగాళాదుంపల ధర కూడా ఒక్కసారిగా పెరిగిపోతుంది. రూ.20 కిలో ఉండాల్సినది రూ.28 అవుతుంది. ఒకవేళ ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే.. సామాన్యుడికి రూ.500 ఫైన్ వేసే చోట.. కార్లో ఉన్నవాడికి రూ.1,500 చెల్లించాల్సి వస్తుంది. చేతిలో ఐఫోన్ కనిపిస్తే.. రూ.200 విలువైన మొబైల్ కవర్‌కు రూ.700 చెబుతారు. వీటన్నింటికీ మించి, మన దగ్గర డబ్బు ఉందని తెలిస్తే తిరిగి ఇవ్వని అప్పులు అడిగేవాళ్లు కూడా ఎక్కువ అవుతారు" అని ఆయన వివరించారు.

**ఐఫోన్ వదిలేశారు.. కానీ చౌకైనవి కొనలేదు**

తాను ఒకప్పుడు ఐఫోన్, మ్యాక్‌బుక్ ఉపయోగించేవాడినని, అయితే వాటిని అమ్మేసి ప్రస్తుతం వివో స్మార్ట్‌ఫోన్, ఆసుస్ ల్యాప్‌టాప్ వాడుతున్నానని తెలిపారు. అలాగే ఇప్పటికీ 10 ఏళ్ల పాత హ్యాచ్‌బ్యాక్ కారునే నడుపుతున్నానని చెప్పారు.




అయితే ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటంటే.. ప్రస్తుతం తాను వాడుతున్న వివో ఫోన్ పాత ఐఫోన్ కంటే ఖరీదైనదే.. ఆసుస్ ల్యాప్‌టాప్ కూడా మ్యాక్‌బుక్ కంటే ఎక్కువ ధర కలిగినదేనని వెల్లడించారు.

దీనిబట్టి ఆయన ఉద్దేశం చౌకైన వస్తువులు కొనడం లేదా కంజూసితనం ప్రదర్శించడం కాదు. కేవలం బ్రాండ్ ఇమేజ్‌ను చూసి సమాజం వేసే అదనపు బాదుడు నుంచి తప్పించుకోవడమే. సాదాసీదాగా కనిపిస్తే అనవసరపు ఖర్చులు ఆటోమేటిక్‌గా తగ్గిపోతాయనేది ఆయన లాజిక్.

**భారతదేశంలో నిజమైన సంపన్నుల మైండ్‌సెట్ ఇదేనా?**

భారతదేశంలో నిజంగా ధనవంతులైన వారు తమ సంపదను ఎప్పుడూ ప్రదర్శించరని మీనాంక్ చెప్పుకొచ్చారు. వారు స్టార్‌బక్స్‌ల వంటి ఖరీదైన కాఫీ షాపుల్లో కాకుండా పాతకాలపు సాధారణ కేఫ్‌లలో కూర్చొని కోట్ల రూపాయల వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుంటారని వ్యాఖ్యానించారు. "తక్కువగా ప్రదర్శించండి... ప్రశాంతంగా జీవించండి... అనవసర దృష్టిని ఆకర్షించొద్దు" అంటూ ఆయన నెటిజన్లకు ఒక బలమైన సందేశాన్ని ఇచ్చారు.

**నెటిజన్ల భిన్నాభిప్రాయాలు.. ఎవరి వాదన వారిదే!**

ఈ వైరల్ పోస్టుపై సోషల్ మీడియా రెండుగా చీలిపోయింది. ఒక వర్గం నెటిజన్లు మీనాంక్ ఆలోచనను పూర్తిగా సమర్థించారు. "ధనవంతుడిలా కనిపించడం కంటే నిజంగా బ్యాంక్ బ్యాలెన్స్ కలిగి ఉండడం ముఖ్యం" "సింప్లిసిటీనే అసలైన ఆయుధం"

అంటూ కామెంట్స్ చేశారు. అయితే మరో వర్గం మాత్రం ఈ లాజిక్‌ను కొట్టిపారేసింది. "మనం సంపాదించేదే మంచి జీవితాన్ని అనుభవించడానికి. ఇతరులు ఏమనుకుంటారో అని భయపడి మనకు నచ్చిన బ్రాండ్లను వదులుకోవాలా?" అని ప్రశ్నించారు. పని అవసరాలకు, క్వాలిటీకి ప్రాధాన్యత ఇవ్వాలే తప్ప ఇలాంటి మైండ్ గేమ్స్ అవసరం లేదని కొందరు వాదించారు.

చివరగా బ్రాండ్స్ , లుక్స్ ఆధారంగా సమాజం మనల్ని జడ్జ్ చేయడం అనేది పచ్చి నిజం. మరి ఈ "లుక్స్ రిచ్ ట్యాక్స్" నుంచి తప్పించుకోవడానికి మీనాంక్ మిన్ను అనుసరించిన వ్యూహం ఇప్పుడు నెట్టింట చర్చ సాగుతోంది.

# రాజకీయ జిల్లాలో వైసీపీ వీక్ అవుతోందా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో చూసినా లేక అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత చూసినా రాజకీయ చైతన్యం అంతా అనకాపల్లి చుట్టూనే ఉంటూ వస్తోంది. ఎంతో మంది దిగ్గజ నేతలు అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఎంపీగా పోటీ చేశారు. అంతే కాదు జాతీయ స్థాయి నాయకుల సభలు సమావేశాలు రాజకీయ చర్చలు అన్నీ కూడా అనకాపల్లి కేంద్రంగానే సాగుతూ వచ్చాయి. మొదటి నుంచి కూడా రాజకీయ జిల్లాగా అనకాపల్లికి ఎంతో పేరు ఉంది. అలాంటి రాజకీయ ఖిల్లా అయిన అనకాపల్లిలో వైసీపీ వీక్ గా ఉంది అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**గట్టి నేతల కరవు :**

అనకాపల్లి అంటేనే నాయకుల కేంద్రంగా చెబుతారు. అక్కడ నుంచే నాయకులు ఎంతో మంది తయారు అయ్యారు. ఎంపీలు ఎమ్మెల్యేలు మంత్రులు అయ్యారు. అలాంటి అనకాపల్లిలో ఇపుడు వైసీపీకి గట్టి నాయకుల కొరత పట్టి పీడిస్తోంది. సీనియర్ నేతలు అయితే పెద్దగా లేకపోవడం వల్ల వ్యూహాల లేమితో సతమతం అవుతోంది అని అంటున్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వైసీపీ పుట్టుక నుంచి ఉంటూ ఆ పార్టీని బలోపేతం చేశారు. అయితే ఆయన 2014 ఎన్నికల తరువాత తప్పుకున్నారు. ప్రస్తుతం ఆయన జనసేన ఎమ్మెల్యేగా ఉన్నారు. దాంతో ఆ పార్టీని పటిష్టం చేసే పనిలో సీరియస్ గా పనిచేస్తున్నారు. అలాగే మరో సీనియర్ నేత మాజీ



మంత్రి దాడి వీరభద్రరావు కూడా వైసీపీ నుంచి వెళ్ళిపోయారు. ఆయన టీడీపీలో కొనసాగుతున్నారు. తన కుమారుడు రాజకీయ భవిష్యత్తు కోసం ఆయన వైసీపీ కంటే టీడీపీ బెటర్ అని ఈ వైపునకు వచ్చేశారు అని చెబుతారు.

**సైలెంట్ మోడ్ లో అంతా :**

ఇక వైసీపీలో ఉన్న నాయకులు చూస్తే వారంతా సైలెంట్ మోడ్ లో ఉంటున్నారు. 2019 నుంచి 2024 దాకా అనకాపల్లి ఎంపీగా పనిచేసిన భీశెట్టి సత్యవతి పార్టీ యాక్టివిటీస్ లో పెద్దగా కనిపించడంలేదు. ఆమెకు పార్టీలో పదవులు వైసీపీ అధినాయకత్వం ఇచ్చినా కూడా ఎందుకో చురుకుగా వ్యవహరించడంలేదు అని అంటున్నారు. అలాగే 2024 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన బూడి ముత్యాలనాయుడు కూడా గతంలో మాదిరిగా ఇపుడు యాక్టివ్ గా లేరు. ఆయన మాడుగుల నియోజకవర్గానికే పరిమితం అయిపోయారు. అక్కడ కూడా ఆయన జోరు నెమ్మదించింది అని అంటున్నారు. పాయకరావు పేట నుంచి రాజ్యసభ సభ్యుడిగా గొల్ల బాబూరావు ఉన్నా ఆయన కూడా పెద్దగా దూకుడు చేయడం లేదని అంటున్నారు. దాంతో అనకాపల్లి జిల్లా కేంద్రంగా వైసీపీ రాజకీయం అంతా పూర్వ పక్షంగా సాగుతోంది అన్న విమర్శలు ఉన్నాయని చెబుతున్నారు.

**కూటమిని ఎదుర్కోవాలంటే :**

ఇక మూడు పార్టీలతో కూటమి పటిష్టంగా ఉంది. అలాంటి కూటమిని ఎదుర్కోవాలీ అంటే వైసీపీ ఎంతగానో శ్రమించాల్సి వస్తోంది. బీజేపీ నుంచి అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేష్ కి సొంతంగా అంగబలం అర్థబలం ఉన్నాయి. ఆయన రాయలసీమ నుంచి వచ్చినా అనకాపల్లిలో తనకంటూ ప్రత్యేక రాజకీయ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అదే విధంగా జనసేన కూడా తన పలుకుబడిని విస్తరించుకుంటోంది. టీడీపీకి లెక్కలేనంత మంది నాయకులు ఉన్నారు. వారిని ఢీ కొట్టాలంటే వైసీపీకి బలం సరిపోవడం లేదని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ కాయ కల్ప చికిత్స చేయాల్సిందే అని అంటున్నారు. ఉన్న నాయకులను యాక్టివ్ మోడ్ లో ఉంచడంతో పాటు ఇతర పార్టీల నేతలను ఆకట్టుకోవడం ద్వారా రాజకీయ జిల్లాలో బలమైన స్వరాన్ని వినిపించగలదని అంటున్నారు.

# లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో చివరి వన్డే.. చివరి నిమిషంలో భారత జట్టులో భారీగా మార్పులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో జరగబోయే మూడో అలాగే సిరీస్ నిర్ణయాత్మక వన్డే మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టులో ఒక కీలక మార్పు చోటు చేసుకుంది. గాయపడిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్ష్ దూబే ను జట్టులోకి చేర్చినట్లు భారత క్రికెట్ నియంత్రణ బోర్డు అధికారికంగా ప్రకటించింది.

**సుందర్‌కు హ్యామ్‌స్ట్రింగ్ గాయం:**
కార్డిఫ్‌లోని సోఫియా గార్డెన్స్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ కుడి హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. దీంతో అతను ఈ మ్యాచ్‌కు పూర్తిగా దూరమయ్యాడు. బీసీసీఐ దీనిపై స్పందిస్తూ, వాష్టింగన్ తదుపరి చికిత్స కోసం స్కాన్‌లు చేయించుకుని, నిపుణుల సలహా తీసుకోనున్నాడని తెలిపింది. అతను పూర్తిగా కోలుకోవడానికి మరో రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

**అంతర్జాతీయ వేదికపై హర్ష్ దూబే ప్రదర్శన:**
యువ ఆల్‌రౌండర్ హర్ష్ దూబేకు ఇంగ్లాండ్ కండిషన్స్‌లో తన ప్రతిభను నిరూపించుకోవడానికి ఇదొక గొప్ప అవకాశం. జూన్ నెలలో ధర్మశాలలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా దూబే వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో 47 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి అందరినీ ఆకట్టుకున్నాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన రెడ్-బాల్ సిరీస్‌లో ఇండియా 'ఎ' విజయం సాధించడంలోనూ దూబే కీలక పాత్ర పోషించాడు. అక్కడ 4 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లో 30, 29 పరుగులతో రాణించాడు. ప్రస్తుతం వన్డే జట్టులోని స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్‌లతో దూబే జతకట్టనున్నాడు.

**లార్డ్స్ మ్యాచ్ ముగియగానే జింబాబ్వే టూర్‌కు పయనం:**
ఆదివారం లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగే మ్యాచ్ ముగిసిన వెంటనే హర్ష్ దూబే నేరుగా జింబాబ్వే వెళ్లనున్నాడు. అక్కడ జూలై 23 నుంచి హరారే వేదికగా ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడు. ఈ సిరీస్‌లోని మిగిలిన రెండు మ్యాచ్‌లు జూలై 25, 26 తేదీలలో హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి.

**భారత్ స్క్వాడ్:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, శివం దూబే, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే.

# భారత్, ఇంగ్లాండ్ ప్లేయర్ల చేతులకు బ్లాక్ బ్యాండ్స్.. ఎందుకో తెలుసా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో వన్డే మ్యాచ్ ప్రారంభానికి ముందు మైదానంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరైన వెస్టిండీస్ లెజెండ్ సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ఇటీవల కన్నుమూశారు. ఆయనకు గౌరవ సూచకంగా భారత్, ఇంగ్లాండ్ ఆటగాళ్లు తమ చేతులకు నల్లటి రిబ్బన్లు ధరించి మైదానంలోకి అడుగుపెట్టారు.

**నిమిషం పాటు మౌనం.. లార్డ్స్‌లో ఉద్వేగభరిత క్షణాలు:**
మ్యాచ్ ప్రారంభానికి ముందు లార్డ్స్ స్టేడియంలోని ఇరు జట్ల ప్లేయర్స్, అంపైర్లు, స్టేడియం సిబ్బంది, అభిమానులు అందరూ కలిసి సర్ గార్ఫీల్డ్ సోబర్స్ జ్ఞాపకార్థం ఒక నిమిషం పాటు మౌనం (వీఅఅబ్వ'ం ంఱశ్రీవఅషవ) పాటించారు. 89 ఏళ్ల వయసులో ఆయన మరణించడం క్రికెట్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో ఆటగాళ్లు ఆయనకు అర్పించిన నివాళి క్రికెట్ అభిమానులను కలచివేసింది.

**అంతర్జాతీయ క్రికెట్‌పై చెరగని ముద్ర:**
మాజీ వెస్టిండీస్ కెప్టెన్ అయిన సర్ గార్ఫీల్డ్ సోబర్స్ అంతర్జాతీయ క్రికెట్‌పై వేసిన ముద్ర సామాన్యమైనది కాదు.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని రంగాలలోనూ అద్భుతాలు సృష్టించిన ఆయన ఆటతీరు తరతరాల క్రికెటర్లకు రోల్ మోడల్‌గా నిలిచింది. క్రీడా ప్రపంచం మొత్తం ఆయన సేవలను స్మరించుకుంటున్న తరుణంలో, ఈ లార్డ్స్ వన్డే ద్వారా ఆటగాళ్లు తమ సెంటిమెంట్‌ను చాటుకున్నారు.

ఈ ఉద్వేగభరిత నివాళి అనంతరం భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య సిరీస్ నిర్ణయాత్మక పోరు ప్రారంభమైంది. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ 1--1తో సమంగా నిలిచింది. ఈ కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు మొదటగా బ్యాటింగ్ చేస్తోంది. సర్ గార్ఫీల్డ్ సోబర్స్ మరణం తెచ్చిన శోకసంద్రంలోనే ఇరు జట్లు క్రీడాస్ఫూర్తితో ఈ మెగా ఫైట్‌ను మొదలుపెట్టాయి.

# చరిత్ర సృష్టించిన సింధు: జపాన్ ఓపెన్ టోర్నీ విజేతగా భారత స్టార్ షట్లర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టోక్యో: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ టోర్నీ 2026 విజేతగా నిలిచింది. ఆదివారం (జులై 19) జరిగిన ఉమెన్స్ సింగిల్స్ ఫైనల్ పోరులో ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచిపై 21-17, 21-17 తేడాతో సింధు చారిత్రాత్మక విజయం సాధించింది. తద్వారా తన ఏడేళ్ల మేజర్ టైటిల్ నిరీక్షణకు తెరదించడంతో పాటు జపాన్ ఓపెన్ టోర్నీ టైటిల్ గెల్చుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా తెలుగు తేజం సింధు నయా చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ టోర్నీగా విజేతగా నిలిచిన పీవీ సింధుకు పలువురు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

**వరుస సెట్లలో మట్టికరిపించిన సింధు:**
ఆదివారం (జులై 19) జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో మెరుపుల్లాంటి స్మాష్?లు, వ్యూహాత్మక డ్రాప్ షాట్‌లతో మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన యమగూచిపై సింధు పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. ఆట మొదటి నుంచి ఎండింగ్ వరకు ఎక్కడా కొంచెం కూడా ఒత్తిడికి గురికాకుండా సింధు చాలా దూకుడుగా ఆట కొనసాగించింది.

సొంత గడ్డపై యమగుచిని కేవలం 50 నిమిషాల్లోనే భారత షట్లర్ మట్టికరిపించింది. యమగూచి ప్రతిఘటించే ప్రయత్నం చేసిన సింధు ఆ అవకాశం ఇవ్వలేదు. 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో భారత షట్లర్ విజయం సాధించింది. తద్వారా తొలిసారి జపాన్ ఓపెన్ టైటిల్?ను సింధు కైవసం చేసుకుంది. అంతేకాకుండా ఈ టైటిల్ గెలిచిన తొలి భారత మహిళా షట్లర్ గా సింధు రికార్డ్ క్రియేట్ చేసింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ గెలిచిన తర్వాత ఆమె గెలుచుకున్న మేజర్ టైటిల్ ఇదే. దీంతో మేజర్ టైటిల్ కోసం సింధు ఏడేళ్ల నిరీక్షణ ముగిసింది. ఈ విజయంతో యమగుచిపై తన హెడ్-టు-హెడ్ రికార్డ్?ను సింధు 16-14కు పెంచుకుంది.

## మాధురీ జైన్ జగన్ గందరగోళంలో ప్రశాంతత నెలకొంది



# టైగర్ వర్సెస్ పఠాన్: బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ మల్టీస్టారర్ పూర్తిగా ఆగిపోయినట్టేనా?



భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ యాక్షన్ ఫ్రాంఛైజీగా వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లో భారీ సినిమాలను యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బాలీవుడ్ టాప్ సూపర్‌స్టార్స్ షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్‌లను ఒకే స్క్రీన్‌పై పూర్తిస్థాయిలో చూపించి.. నెవ్వర్ బిఫోర్ అనిపించేలా సరికొత్త రికార్డులను సృష్టించాలని -టైగర్ వర్సెస్ పఠాన్- అనే భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. పఠాన్ గ్రాండ్ సక్సెస్ అయ్యాక వైఆర్ఎఫ్ ఉత్సాహం ఇది. అయితే గత కొంతకాలంగా ఈ సినిమాకు సంబంధించిన ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో.. అసలు ఈ క్రేజీ ప్రాజెక్ట్ బడ్జెట్ సహా రకరకాల కారణాల వల్ల పూర్తిగా ఆగిపోయినట్టేనా? అనే అనుమానాలు ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి.వైఆర్ఎఫ్ సంస్థకు ఈ డ్రీమ్ ప్రాజెక్ట్ విషయంలో ఆది నుంచి ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే ఉంది. ముఖ్యంగా పఠాన్ తర్వాత షారూఖ్ అతిథిగా సల్మాన్ నటించిన టైగర్ 3 ఆశించిన విజయాన్ని సాధించలేదు. ఇటీవలి కాలంలో వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి వచ్చిన భారీ బడ్జెట్ చిత్రం -ఆల్ఫా- బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేక తీవ్ర పరాజయాన్ని చవిచూసింది. ఈ వరుస ఫ్లాప్‌ల వల్ల నిర్మాణ సంస్థ ప్రస్తుతం తీవ్రమైన నీరసంలో- ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బ్యాక్-టు-బ్యాక్ పడిన ఈ పంచ్‌ల వల్ల ఖాన్‌లిద్దరినీ కలిపి సినిమా చేసే సాహసం వైఆర్ఎఫ్ ప్రస్తుతానికి చేయలేకపోతోందని బాలీవుడ్ టాక్. ఈ సినిమా పట్టాలెక్కకపోవడానికి ప్రధాన కారణం భారీ బడ్జెట్ - స్టార్ల రెమ్యునరేషన్స్ అని విశ్లేషకులు చెబుతున్నారు. నేటి రోజుల్లో షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్ లాంటి అగ్ర స్టార్లు ఒక్కో సినిమాకు కేవలం పారితోషికంగానే దాదాపు 100 కోట్ల రూపాయలకు పైగా డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా.. సినిమా లాభాల్లో కూడా భారీగా వాటాలు తీసుకుంటున్నారు. ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్ల పారితోషికాలకే భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తే..నిర్మాణ సంస్థకు మిగిలేది ఏమీ ఉండదని ఒక అంచనా. పైగా ఈ ఇద్దరు మాస్ హీరోలను ఒకే ఫ్రేమ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో చూపించాలంటే కేవలం మేకింగ్ కోసమే 500 కోట్ల రూపాయలకు పైగా బడ్జెట్‌ను కేటాయించాల్సి ఉంటుంది. ఒకవేళ ఇంత భారీ బడ్జెట్‌తో సినిమా తీసినా.. పాన్ ఇండియా స్థాయిలో ఆశించిన మేర భారీ విజయం దక్కకపోతే ఆ పెట్టుబడిని తిరిగి రికవరీ చేయడం అంత సులువైన పని కాదు. ఇటీవలి పరాజయాల నేపథ్యంలో.. మార్కెట్ లెక్కలను బేరీజు వేసుకుంటున్న యష్ రాజ్ ఫిల్మ్స్ అధినేత ఆదిత్య చోప్రా ఇంతటి భారీ పెట్టుబడులు పెట్టేందుకు తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే -టైగర్ వర్సెస్ పఠాన్- స్క్రిప్ట్ వర్క్- బడ్జెట్ రీ-వర్క్ దశలోనే ఆగిపోయిందని.. దీనిపై ఎలాంటి కదలికలు లేవని సమాచారం. మరి వైఆర్ఎఫ్ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను బడ్జెట్ తగ్గించి కొద్దిరోజుల తర్వాత మళ్లీ పట్టాలెక్కిస్తుందా? లేక రిస్క్ ఎందుకని శాశ్వతంగా పక్కనబెట్టేస్తుందా? అనేది వేచి చూడాలి. ఏదేమైనా షారూఖ్-సల్మాన్‌ల అసలైన యాక్షన్ బాటిల్‌ను థియేటర్లలో చూడాలనుకున్న సగటు సినిమా అభిమానులకు మాత్రం ఈ న్యూస్ కాస్త నిరాశ కలిగించే విషయమే.

## ప్రగ్యా జైస్వాల్ ఇష్టమైన రంగులో రాత్రి



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965